


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


18.08.2026
మంగళవారం| రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 49
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## పేకాటరాయుళ్లా.. కాంగ్రెస్ నాయకులా?

- మంత్రి అనుచరులమంటూ హవా.. ప్రజా సమస్యలపై మౌనం!
- ఇసుక ర్యాంపులు.. భూ పంచాయితీలు.. పేకాట దందాలేనా?
- అధికార పార్టీలో 'వైట్ కాలర్' నేతల వ్యవహారాలపై ఆరోపణలు
- పట్టుబడుతున్నా.. చర్యలు లేవా? కాంగ్రెస్‌లో ఎవరి అండ?
- ప్రజా సమస్యలు గాలికి.. జూదం వ్యవహారాలకే ప్రాధాన్యమా? 6లో..



## తెలంగాణ సర్ ఓటర్ డ్రాఫ్ట్ విడుదల

- 73 లక్షల ఓట్లు డిలీట్
- మొత్తం 3.38 కోట్లకుపైగా ఓటర్లు ఉండగా..
- 2.64 కోట్ల మంది మాత్రమే ఎన్యుమరేషన్
- 57.46 లక్షల మంది అడ్రస్ మారడం



హైదరాబాద్, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
తెలంగాణ రాష్ట్రంలో సర్ ఓటర్ డ్రాఫ్ట్ జాబితా విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఈ డ్రాఫ్ట్ రోల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారికంగా ప్రచురించారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవడానికి, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ జాబితా ఎంతగానో ఉపయోగపడుతుంది. 2లో..

# పేదలకు కార్పొరేట్ వైద్యం

- విద్య, వైద్యంపై వ్యయం పెట్టుబడేనన్న సీఎం
- పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌కు రూ.5,226 కోట్లు
- 2027 డిసెంబర్‌లోగా 4 ఆస్పత్రులు పూర్తి
- ఆరు నెలలకు ఓ ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం
- ప్రభుత్వ వైద్యులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- నర్సుల సేవలకు అధిక ప్రాధాన్యం: సీఎం
- వైద్యంపై పేదల్లో నమ్మకం కల్పించడమే లక్ష్యం



హైదరాబాద్, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యాంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్‌లో మర్రిచెన్నారెడ్డి టిమ్స్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. "ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందిస్తున్నాం. మా పాలనలో ఆరోగ్య శ్రీ కింద రూ.2,700 కోట్లు చెల్లించాం. రోగులతో పాటు ఆస్పత్రికి వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మ సార్థకం అయినట్లే. మన నర్సింగ్ స్టాఫ్‌పై జర్మనీ, జపాన్, దక్షిణకొరియా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తిచేస్తాం. ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభిస్తాం.

కార్పొరేట్ ఆస్పత్రుల్లాగే వీటిని నిర్వహిస్తాం. రోగులకు 70 శాతం నర్సింగ్ సిబ్బంది, మిగతా 30 శాతం వైద్యులు సేవలు అందిస్తారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేట్‌లో ఎక్కువ నిధులు ఇస్తున్నాం. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రుల్లో అదనపు సేవలు అందిస్తే ప్రోత్సాహకాలు ఇస్తాం. కష్టం వస్తేనే సంక్షేమ పథకాలు ఉచితంగా పొందాలని అనుకుంటారు. గౌరవంగా బతకాలి, కష్టపడాలి అని ప్రజలు కోరుకుంటారు. సంక్షేమ పథకాలు తగ్గించాలంటే ప్రజలు స్వతంత్రంగా బతికేలా అవకాశాలు కల్పించాలి" అని రేవంత్ అన్నారు.

పేద ప్రజలు అనారోగ్యం పాలైనప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి తమ ఆస్తులతో పాటు శరీర అవయవాలను కూడా అమ్ముకోవాల్సి వస్తోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దయనీయ పరిస్థితులను తుడిచిపెట్టడానికే ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ఆస్పత్రుల్లో ట్రాన్స్‌ప్లాంటేషన్ (అవయవ మార్పిడి) కోసం ప్రత్యేక విభాగాలను తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

తమ 32 నెలల పాలనా కాలంలో ఆరోగ్యశ్రీ , సీఎమ్ఆర్ఎఫ్ ద్వారా పేదల చికిత్సల కోసం రూ. 5,226 కోట్లు ఖర్చు చేశామని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ కోసం మొత్తం రూ. 21,800 కోట్లకు పైగా కేటాయించామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల అటెండెంట్లకు ఉచిత వసతితో పాటు క్యాంటీన్ సదుపాయం కల్పించే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు.
వైద్య వ్యవస్థలో 60 నుంచి 70 శాతం వైద్య సేవలను నర్సులే అందిస్తారని, మిగిలిన 30 శాతం సేవలను వైద్యులు అందిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, సీఎమ్ఆర్ఎఫ్ కింద పేదలకు మెరుగైన వైద్యం అందించే వైద్యులకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకే ఎక్కువ నిధులు వెళ్తున్నాయని, ఆ పరిస్థితిని మార్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు కూడా మంచి ఇన్సెంటివ్‌లు ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. 6లో..

## నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

22ఏ నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి ప్రకటన



2లో..

హైదరాబాద్, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులకు ఎలాంటి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారుల తప్పిదాల కారణంగా కొన్ని ప్రైవేటు భూములు 22ఏ నిషేధిత జాబితాలో చేరాయని.. వాటిని పరిశీలించి న్యాయబద్ధమైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు.

## విమాన ఛార్జీలపై సుప్రీంకోర్టు కీలక సూచనలు

### 3 వారాలు గడువు విధింపు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
దేశంలో విమాన టికెట్ ధరలు, సర్జ్ ప్రైసింగ్, అదనపు లగేజీ ఛార్జీలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ధరల నిబంధనలను పాటించని ఎయిర్‌లైన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటిని గ్రౌండ్ చేయాలని కేంద్రానికి సూచించింది. ఇదే సమయంలో విమాన ఛార్జీలకు సంబంధించి తుది నిబంధనలను మూడు వారాల్లోగా నోటిపై చేస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. 2లో..

## డీఎస్సీని బాధ్యతగా తీసుకుని నిర్వహించాం




- మంత్రి నారా లోకేష్ వెల్లడి
- ఏటా డీఎస్సీని నిర్వహిస్తాం
- ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాం
- 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి
- విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చాం 2లో..

అమరావతి, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మెగా డీఎస్సీ2025పై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించామని పేర్కొన్నారు. "ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసింది. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా ఉండాలని సీఎం భావించారు. మా ప్రభుత్వం టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్‌లకు పంపింది.

## జనరల్ సెక్రెటరీగా స్మృతి ఇరానీ

- బీజేపీ కొత్త కార్యవర్గం
- ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, రామ్ మాధవ్
- మొత్తం 13 మందికి అవకాశం 5లో..



## ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ ర్యాంక్ హోదా

కీలక పదవిలో నియామకం! గ్రీన్ నిర్వాహక కమిటీ చైర్మన్‌గా.. 2లో..

అమరావతి, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
జనసేన ఎమ్మెల్సీ, సినీ నటుడు కొణిదెల నాగబాబుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవి అప్పగించింది. ఆయనకు క్యాబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పర్యావరణ, అటవీశాఖకు సంబంధించిన గ్రీన్ నిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబును ప్రభుత్వం నియమించింది. ఈ పదవికి కేబినెట్ ర్యాంక్ కల్పించడంతో.. రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

## సర్వోన్నత న్యాయస్థానం భారీ ఉపశమనం

- ఇప్పటి వరకు
- ఎందుకు మౌనంగా ఉన్నారు?
- రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో..
- సీబీఐ,ఈడీలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 17, అనంత జనశక్తి న్యూస్
ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టు విచారణను నిలిపివేయాలని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి నివేదికలను దాఖలు చేయవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థలను అత్యున్నత న్యాయస్థానం సోమవారం ఆదేశించింది. 2లో..

## బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారు

### పథకాలను యథాతథంగా కొనసాగిస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్
తెలంగాణలో పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాల అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ పథకాలపై విధించిన స్టేను తొలగించేందుకు త్వరలోనే హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేసింది. గత ప్రభుత్వం తెచ్చిన లోపభూయిష్టమైన ఉత్తర్వుల వల్లే ప్రస్తుత న్యాయపరమైన చిక్కులు తలెత్తాయని, త్వరలోనే అన్ని పొరపాట్లను సరిదిద్ది పథకాలను కొనసాగిస్తామని ప్రకటించింది. 2లో..

## ఐదుగురు టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- టెట్ నిబంధనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం తప్పా
- టీచర్ల సస్పెన్షన్‌పై జగన్ ఆగ్రహం
- మీరు చేయలేదని, వాళ్లు ప్రయత్నించారు
- టీచర్లకు క్షమాపణ చెప్పి తప్పును సరిదిద్దుకోండి

5లో..

# బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారు



(మొదటి పేజీ తరువాయి)

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి గతంలో జారీ చేసిన 8 జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు, 12.08.2026న మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. 09.09.2026 వరకు ఈ పథకాలపై స్టే విధిస్తున్నట్లు పేర్కొంది. న్యాయస్థానం ఆదేశాలను గౌరవిస్తూనే, పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా ఈ పథకాల రాజ్యాంగబద్ధతను, అవసరాన్ని కోర్టుకు వివరిస్తామని ప్రభుత్వం తెలిపింది.

2014లో పథకాన్ని ప్రారంభించిన సమయంలో అప్పటి ప్రభుత్వం సరైన నిబంధనలతో జీవోలు ఇవ్వలేదని, అందుకే ఇప్పుడు సాంకేతిక ఆధారాలతో కోర్టులో పిటిషన్లు పడ్డాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే అధికారుల లోపమా లేదా విభాగాధిపతుల అలసత్వమా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు ఎలాంటి జాప్యం లేకుండా 'గ్రీన్ ఛానెల్' ద్వారా నిధులను నేరుగా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు హైకోర్టు స్టేను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దీని రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నారని మండిపడ్డారు.

'గత ప్రభుత్వం తెచ్చిన పథకం అని నిర్లక్ష్యం చేయకుండా కొనసాగిస్తున్నాం. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత మందికి ఇళ్లు ఇచ్చారు. ఎంత మందికి ఉపాధి కల్పించారు చర్చ చేద్దాం. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు తెలుపుతుంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా పథకాల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత, ప్రజా ప్రయోజనాన్ని వివరించింది.' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ ర్యాంక్ హోదా



(మొదటి పేజీ తరువాయి)

గతంలో నాగబాబుకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఉందంటూ ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం ఆయనను కీలక కమిటీకి చైర్మన్‌గా నియమిస్తూ కేబినెట్ హోదా ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. నాగబాబు నియామకం నేపథ్యంలో శాసనమండలిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాగబాబును పలకరించి కుశల ప్రశ్నలు అడిగారు. ఇద్దరు నేతలు కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు కుటుంబ సభ్యుల గురించి నాగబాబును అడిగి తెలుసుకున్నారు. 'పిల్లలు బాగున్నారా?' అంటూ త్రిమూర్తులు ప్రశ్నించగా.. నాగబాబు కూడా ఆయనతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. అలాగే నాగబాబు ఆరోగ్యం గురించి కూడా తోట త్రిమూర్తులు అడిగారు. రాజకీయంగా వేర్వేరు పార్టీలకు చెందిన నేతలు శాసనమండలిలో ఆప్యాయంగా పలకరించుకోవడం అక్కడ ఆసక్తికరంగా మారింది.

# డీఎస్సీని బాధ్యతగా తీసుకుని నిర్వహించాం



(మొదటి పేజీ తరువాయి)


గతంలో వైకాపా ప్రభుత్వం టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టింది" అని మంత్రి లోకేశ్ అన్నారు.

"ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ఉంది. వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చు. భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టుల్లో 336 కేసులు దాఖలు చేశారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. డీఎస్సీలో ఇలాంటి రిజర్వేషన్ అమలు దేశ చరిత్రలోనే తొలిసారి. పారదర్శకంగా మేం నియామకాలు చేపట్టాం. అందుకే వేల మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందగా బయటకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు " అని లోకేశ్ అన్నారు.

ఎక్కడైనా చర్చకు సిద్ధం..

"డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది. కులం, మతం పేరుతో వైకాపా రాష్ట్రంలో చిచ్చు పెడుతోంది. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సభకు రాలేదు. జగన్ అనే వ్యక్తి అంబేడ్కర్ రాజ్యాంగాన్నే ప్రశ్నిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు తీసుకువచ్చారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నాం. ప్రెస్‌మీట్లు ఎందుకు.. జగన్ సభకు ఎందుకు రాలేదు. తేదీ, సమయం ఖరారు చేయండి.. చర్చకు నేను సిద్ధం. సభలోపలనైనా.. వెలుపలనైనా.. ఎక్కడైనా నేను సిద్ధం. నేనేమీ పారిపోవట్లేదు.. మీలాగా నాపై సీబీఐ కేసులు లేవు.. బెయిల్‌పై లేను. సభకు వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నా" అని లోకేశ్ అన్నారు.

# తెలంగాణ సర్ ఓటర్ డ్రాఫ్ట్ విడుదల



(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 3.38 కోట్లకుపైగా ఓటర్లు ఉండగా.., ఇప్పటిదాకా 2.64 కోట్ల మంది మాత్రమే ఎన్యుమరేషన్ ఫామ్స్ సమర్పించారు. మరో 57.46 లక్షల మంది అడ్రస్ మారడం లేదా అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. డిజిటల్ విధానంలో సులభంగా ఓటరు కార్డు వివరాలను తనిఖీ చేసుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది.

ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ద్వారా నమోదులో ఏవైనా లోపాలు ఉన్నవారిని గుర్తించారు. పేరు, తండ్రి పేరు, తోబుట్టువుల మధ్య వయస్సు వ్యత్యాసం, తల్లిదండ్రులతో ఉన్న వయస్సు అంతరం వంటి అంశాలలో లాజికల్ వ్యత్యాసాలు ఉన్న సుమారు 60 లక్షల మంది ఓటర్లకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు త్వరలోనే నోటీసులు పంపనున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర కార్యాలయం నుండి ఈ నోటీసులు నేరుగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లకు చేరుతాయి.

ఆగస్టు 17 (సోమవారం) నుండి ప్రారంభమై సెప్టెంబర్ 16 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. నమోదు చేసుకున్న పిటిషన్లు, అభ్యంతరాల పరిశీలన సోమవారం నుండే ప్రారంభమై అక్టోబర్ 15 వరకు పూర్తవుతుంది. అన్ని దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19న విడుదల చేస్తారు. డ్రాఫ్ట్ లిస్ట్‌లో పేర్లు గైర్హాజరైన వారు లేదా ఈఆర్ఓ నిర్ణయాల వల్ల ఓటు తొలగింపునకు గురైన వారు తమ హక్కులను పునరుద్ధరించుకోవడానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఆశ్రయించవచ్చు. నిర్ణీత గడువులోగా తగిన ఆధారాలతో క్లెయిమ్‌లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 22A భూములపై మంత్రి పొంగులేటి వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రైవేట్ భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ 757 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిలో మేడ్చల్ నుంచి 511, రంగారెడ్డి నుంచి 144, హైదరాబాద్ నుంచి 49, సంగారెడ్డి నుంచి 38 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. అధికారుల తప్పిదంతోనే సమస్య

ఎదురైనట్లు వెల్లడించారు. 22ఏ జాబితాలోకి కొన్ని ప్రైవేటు భూములు ఎలా వచ్చాయనే అంశంపై సబ్ రిజిస్ట్రార్ స్థాయి నుంచి ఐజీ స్థాయి వరకు అధికారులు.. అలాగే రెవెన్యూ అధికారులు, కలెక్టర్లతో చర్చించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గతంలో కొన్ని భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) జాబితాలో ఉండగా.. ఆ తర్వాత వాటికి సంబంధించిన కోర్టు ఆదేశాలు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో అధికారులు సక్రమంగా అప్‌లోడ్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రత్యేకంగా మేడ్చల్ జిల్లాకు



వచ్చిన 511 దరఖాస్తుల్లో సుమారు 320 దరఖాస్తులు యూఎల్‌సీకి సంబంధించినవేనని మంత్రి తెలిపారు. గతంలో ఉన్న కేసుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం వల్ల కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేరినట్లు అధికారులు గుర్తించారని చెప్పారు.

ఈ సందర్భంగా ఈ 22ఏ నిషేధిత జాబితాతో ప్రైవేట్ భూముల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం వాస్తవమేనని పేర్కొన్న పొంగులేటి.. బాధితులకు ప్రభుత్వం తరపున క్షమాపణలు తెలిపారు. న్యాయబద్ధమైన ప్రైవేటు భూములకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. అర్హత ఉన్న కేసులను పరిశీలించి వాటిని 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. కమిటీ ప్రతి వారం కేసులను పరిశీలించి.. ఒక్కో దరఖాస్తును కేసు వారీగా పరిశీలించి పరిష్కరించనుంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. న్యాయబద్ధమైన ఆస్తుల విషయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఇక 22ఏ జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. 1800 599 4788 నంబర్‌కు ఫోన్ చేసి బాధితులు తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు.

22ఏ పేరు చెప్పి ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను మంత్రి హెచ్చరించారు. ప్రైవేటు ఆస్తులను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వ విధానం

కాదని మరోసారి స్పష్టం చేసిన పొంగులేటి.. న్యాయబద్ధమైన భూములకు రిజిస్ట్రేషన్ సహా ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# విమాన ఛార్జీలపై సుప్రీంకోర్టు కీలక సూచనలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ప్రతిపాదించిన కొత్త విమాన ఛార్జీల నిబంధనలను సోమవారం సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో సమర్పించింది. నిబంధనల రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేసినట్లు కేంద్రం కోర్టుకు వివరించింది. అయితే కొన్ని అంశాలపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చే వరకు విమాన ఛార్జీల విషయంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యాలయ మెమోలను మార్గదర్శకాలుగా ఉపయోగిస్తోందని పేర్కొంది.

ఎయిర్‌లైన్స్‌పై చర్యలు

ప్రస్తుతానికి కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను కొన్ని విమానయాన సంస్థలు పాటించడం లేదని పిటిషనర్లు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు.. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే ఎయిర్‌లైన్స్‌పై కఠినంగా వ్యవహరించాలని సూచించింది. నిబంధనలు పాటించని విమానయాన సంస్థలను గ్రౌండ్ చేయాలని కేంద్రానికి స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 7న చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

విమాన ప్రయాణికులపై ప్రభావం చూపుతున్న పలు అంశాలను కొత్త నిబంధనల్లో చేర్చినట్లు కేంద్రం తెలిపింది. ముఖ్యంగా విమాన టికెట్ ఛార్జీల నియంత్రణ, సర్జ్ ప్రైసింగ్, అదనపు లగేజీ ఛార్జీలు, ఛార్జీల పారదర్శకత వంటి అంశాలపై నిబంధనలు ఉండనున్నాయి. విమాన టికెట్ ధరల్లో తరచూ చోటుచేసుకుంటున్న భారీ మార్పులు, ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలను నియంత్రించాలంటూ దాఖలైన పిటిషన్ నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం జూలైలోనే ప్రతిపాదిత విమానయాన నిబంధనలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అప్పట్లో నిబంధనలు రూపొందించామని, వాటిని పార్లమెంట్ ముందుకు తీసుకెళ్లే ముందు చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతోందని కేంద్రం తెలిపింది. అయితే నిబంధనలను రెండు వారాల్లోగా కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌లో విమాన టికెట్ ధరలపై స్పష్టమైన,





తప్పనిసరి నిబంధనలు తీసుకురావాలని కోరారు. సర్జ్ ప్రైసింగ్, లగేజీ ఛార్జీలు, టికెట్ రద్దు, రీఫండ్ నిబంధనలపైనా నియంత్రణ అవసరమని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రయాణికుల ప్రయోజనాలను పరిరక్షించే అధికారాలతో స్వతంత్ర విమానయాన నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

### గతంలోనూ ఆందోళన

విమాన టికెట్ ధరల్లో ఆకస్మిక మార్పులపై సుప్రీంకోర్టు గతంలోనూ ఆందోళన వ్యక్తం చేసింది. పండుగలు, అధిక డిమాండ్ ఉన్న సమయాల్లో విమాన టికెట్ల ధరలు భారీగా పెరగడాన్ని కోర్టు "తీవ్రమైన ఆందోళన కలిగించే అంశం"గా పేర్కొంది. జనవరిలో జరిగిన విచారణ సందర్భంగా కుంభమేళా, ఇతర పండుగల సమయంలో విమాన టికెట్ ధరలు భారీగా పెరిగిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. మార్చిలో విమానయాన రంగంలో ఏర్పడిన అంతరాయాలు, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా పెరిగిన ఇంధన ధరలను ప్రస్తావిస్తూ.. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు కేంద్రం అదనపు సమయం కోరింది.

ఇదిలా ఉండగా.. ఇండిగో విమానాల రద్దు కారణంగా దేశీయ విమాన సర్వీసుల సామర్థ్యం తగ్గి, కొన్ని మార్గాల్లో టికెట్ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో దేశీయ విమాన ఛార్జీలపై తాత్కాలిక పరిమితులు విధించింది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయని కేంద్రం ప్రకటించిన తర్వాత మార్చిలో ఆ పరిమితులను తొలగించింది. అయితే విమానయాన సంస్థలు ఛార్జీలను సహేతుకంగా, పారదర్శకంగా ఉంచాలని, ప్రయాణికుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడాలని ఆదేశించింది. ఆ తాత్కాలిక విధానం ప్రకారం.. 500 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి వన్‌వే టికెట్ ధరను రూ.7,500కు, 1,000 నుంచి 1,500 కిలోమీటర్ల మధ్య ప్రయాణాలకు, ఢిల్లీముంబై వంటి మార్గాల్లో రూ.15,000కు పరిమితం చేశారు.



**కొత్త చట్టం**

**భారతీయ వాయుయాన్ అధినియమ్, 2024 ద్వారా పౌర విమానయానం, విమాన రవాణా సేవల ఆర్థిక నియంత్రణకు కేంద్రానికి అధికారాలు లభించాయి. విమానయాన సంస్థల టారిఫ్‌లను ఆమోదించడం, తిరస్కరించడం లేదా సవరించేందుకు సంబంధించిన నిబంధనలను రూపొందించే అధికారం కూడా కేంద్రానికి ఈ చట్టం కల్పిస్తోంది. టారిఫ్ పరిధిలో ప్రయాణికుల విమాన ఛార్జీలు, ఇతర రుసుములతో పాటు వాటిని ప్రభావితం చేసే విధానాలు, సేవలు కూడా ఉంటాయి. దీంతో కేంద్రం ప్రతిపాదించిన కొత్త విమాన ఛార్జీల నిబంధనలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. సెప్టెంబర్ 7న జరిగే తదుపరి విచారణలో సుప్రీంకోర్టు ఈ నిబంధనలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.**

# సర్వోన్నత న్యాయస్థానం భారీ ఉపశమనం



(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి.. కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను నిలిపివేయాల్సి అలహాబాద్ హైకోర్టుకు ఆదేశాలు జారీచేసింది. ఇదే సమయంలో సీబీఐ, ఈడీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ గాంధీపై ఆరోపణలు అంత తీవ్రమైనవి అయితే ఇప్పటి వరకూ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించింది.

రాహుల్ గాంధీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, పిటిషనర్ విగ్నేష్ శిశిర్ వేసిన పిటిషన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది పూర్తిగా చట్టవిరుద్ధం.. ఇది కక్షపూరితంగా చేపట్టిన చర్య... పిటిషనర్ పదేపదే ఇలాంటి ప్రయత్నాలు చేయడం అత్యంత దురదృష్టకరం.. సీబీఐ కేవలం ఫిర్యాదును సరిచూసుకోవడం తప్ప మరేమీ చేయలేదు'' అని ధర్మాసనానికి కపిల్ సిబల్ తెలిపారు. సీబీఐ, ఈడీల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. ''ఇప్పటి వరకు ఈ కేసులో మా ప్రమేయం ఏమీ లేదు. కానీ, ఫిర్యాదులోని అంశాలు తీవ్రమైన నేరాలకు ఆస్కారం ఇస్తుంటే.. అది చాలా తీవ్రమైన విషయమే అవుతుంది''అని వాదించారు. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ''ఆ విషయంతో మాకు సంబంధం లేదు.. ఎవరైనా హత్య వంటి నేరానికి పాల్పడితే దర్యాప్తులో పోలీసులకు ఎవరి అనుమతి అవసరం లేదు. కానీ ఒకవేళ కోర్టు ఏదైనా ఆదేశాలు ఇవ్వాలనుకుంటే, అది సహజ న్యాయసూత్రాలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది'' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఆరోపణలు అంత తీవ్రమైనవైతే, ఇప్పటి వరకు ఎందుకు మౌనంగా ఉన్నారని, చర్యలు తీసుకోవడానికి కోర్టు ఆదేశాలు ఇవ్వాల్సిందేనా? జస్టిస్ జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ నిలదీశారు. వర్చువల్‌గా విచారణకు హాజరైన పిటిషనర్ విగ్నేష్ శిశిర్.. రాహుల్ గాంధీ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఎఫ్ఐఆర్ నమోదుకు పూర్వ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వాదనలు వినిపించే హక్కు ఉండదని పేర్కొన్నారు. దీనికి సిబల్ జోక్యం చేసుకుంటూ.. వాస్తవాలు ఒప్పు లేదా తప్పుకావచ్చు.. కానీ ఈ రకంగా కోర్టు అధికార పరిధిని ఉపయోగించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఈ దశలో, ఆరోపణలు అంత తీవ్రమైనవైతే ఇప్పటివరకు మీరేం చేస్తున్నారని అదనపు సొలిసిటరీ జనరల్‌ను కోర్టు ప్రశ్నించింది. ''ఇది అంత తీవ్రమైనదైతే, మీ ఏజెన్సీ ఎందుకు మౌనం వహించింది? మీకు కోర్టు ఆదేశం అవసరమా, రాజు గారూ? మీరు సుమోటోగా ఏమైనా చర్య తీసుకున్నారా? లేదు కదూ?' అని జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు.

సీబీఐ స్పందన పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. రాహుల్ గాంధీపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల దర్యాప్తులో పురోగతిని వివరిస్తూ కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ జులై 20న సీబీఐను ఆదేశించింది. అంతేకాకుండా విచారణలో ఏవైనా అక్రమాలు తేలితే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడానికి ఈడీకి స్వేచ్ఛ ఉందనడంతో, రాహుల్ గాంధీ ఈ ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# హేమంత్ జీ.. ఆ విద్యార్థుల్ని వెళ్లి కలవండి: రాహుల్ లేఖ



ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ ఝార్ఖండ్‌లో ఉద్యోగార్థులు గత 23 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. దీంతో ఆందోళన చేస్తున్న విద్యార్థి ప్రతినిధులను వెంటనే వ్యక్తిగతంగా కలవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ .. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ కు లేఖ రాశారు. శాంతియుతంగా నిరసన చేసే హక్కు ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో ఒకటని కాంగ్రెస్ విశ్వసిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే గత కొన్ని నెలలుగా పేపర్ లీక్‌లు, విద్యా వ్యవస్థలోని అవకతవకలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన విద్యార్థులకు తమ పార్టీ మద్దతు అందిస్తోందన్నారు.
'హేమంత్ సోరెన్ జీ.. ఝార్ఖండ్‌లోని విద్యార్థులు కూడా రాష్ట్ర నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. వారి డిమాండ్లు న్యాయబద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే మీరు ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్థులతో సంప్రదింపులు జరుపుతోంది. అయినప్పటికీ కొందరు నిరసనకారులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. అందువల్ల, మీరు స్వయంగా వెళ్లి వారిని కలవండి. అలా చేస్తే వారికి ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, ప్రభుత్వానికి ప్రజల సమస్యల పరిష్కారాలపై ఉన్న నిబద్ధత మరింత బలోపేతం అవుతాయి. దేశ భవిష్యత్తు అయిన ఆ యువకుల వాదనలు విని.. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోండి' అని రాహుల్ లేఖలో పేర్కొన్నారు.

**హేమంత్ సోరెన్, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలు దహనం**

మరోవైపు, ప్రభుత్వం తమ డిమాండ్లపై తగిన హామీ ఇవ్వలేదని ఆరోపిస్తూ ఝార్ఖండ్‌లో ఉద్యోగార్థులు నిరసన కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలంటూ రాహుల్ గాంధీని కోరారు. లేదంటే అధికార కూటమికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చడంలో జేఎంఎం‌కాంగ్రెస్ కూటమి విఫలమైందని ఆరోపిస్తూ.. ఆదివారం రాంచీలో హేమంత్ సోరెన్, రాహుల్ గాంధీ సహా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ క్రమంలో సోరెన్‌కు రాహుల్ లేఖ రాయడం గమనార్హం.

# తుపాకీతో ఇన్‌స్టాలో పోస్టు.. ఇంటికెళ్లి చూస్తే నోట్ల కట్టలు..!

తుపాకీ పట్టుకొని ఉన్న ఫొటోను ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు తీగలాగగా అక్రమార్జన డొంక కదిలింది. తుపాకీ స్వాధీనం కోసం వెళ్తే.. అతడి ఇంట్లో ఏకంగా రూ.3కోట్ల నగదు బయటపడింది. ఈ ఘటన మధ్యప్రదేశ్ లోని సాగర్ ప్రాంతంలో చోటుచేసుకుంది.
పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులను తనిఖీ చేస్తుండగా సాగర్ ప్రాంతానికి చెందిన సౌరభ్ అహిర్వార్ తుపాకీ పట్టుకున్న ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేసినట్లు గుర్తించారు. దీంతో అతడి ఇంటికి వెళ్లిన పోలీసులు తుపాకీ కోసం సోదాలు చేపట్టారు. తనిఖీల్లో ఆయుధం లభించలేదు కానీ.. ఓ బీరువా అనుమానాస్పదంగా కన్పించింది. దాని గురించి కుటుంబసభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు బీరువాను పగలగొట్టారు. దీంతో నోట్ల కట్టలు బయటపడ్డాయి.
పెద్ద పెద్ద సంచుల్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలు లభ్యమవ్వడంతో వాటిని లెక్కించడానికి పోలీసులు కౌంటింగ్ మెషిన్‌ను తీసుకొచ్చారు. మొత్తం రూ. 3కోట్ల నగదు ఉన్నట్లు వెల్లడించారు. ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్న సౌరభ్ అహిర్వార్ వద్ద.. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎలా వచ్చిందనే విషయంపై పోలీసులు ఆరా తీశారు. అయితే, ఆ డబ్బు తమది కాదని.. కొన్ని నెలల క్రితం తమ బంధువు వాటిని తీసుకువచ్చి ఇక్కడ దాచాడని సౌరభ్ విచారణలో పేర్కొన్నాడు. సదరు బంధువు భోపాల్‌లోని పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజినీర్‌గా పని చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.




# ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా



ఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు.
''షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి'' అని అమిత్ షా తెలిపారు.
ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు.
ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంటూ ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# నాలుగు నెలల్లో 22 మందికి మరణశిక్ష..!

ఉత్తర్‌ప్రదేశ్ లోని ముజఫర్‌నగర్ కోర్టు సంచలన తీర్పులతో వార్తల్లో నిలిచింది. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ గత నాలుగు నెలల్లో విచారించిన 10 కేసుల్లో.. ఏకంగా 22 మందికి మరణశిక్ష విధించారు. న్యాయవాది హత్య నుంచి కిడ్నాప్, దోపిడీ వంటి పలు కేసుల్లో దోషులుగా తేలిన వారికి ఈ శిక్షలు పడ్డాయి.
గతంలో బరేలీలో పనిచేసిన సమయంలోనూ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్.. 13 మందికి మరణశిక్ష విధించారు. దీంతో ఇప్పటివరకు ఆయన విధించిన మరణశిక్షల సంఖ్య 35కు చేరింది. 2022లో వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు సముదాయంలో వీడియో సర్వేకు ఆదేశించి ఆయన జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఇటీవల కాలంలో వరుసగా మరణశిక్షలు విధించడంతో 'అత్యంత అరుదైన కేసుల్లోనే' ఈ శిక్ష విధించాలన్న న్యాయసూత్రంపై చర్చ మొదలైంది. అయితే సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష తుది తీర్పు కాదు. హైకోర్టు ధ్రువీకరించిన తర్వాతే దాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ హైకోర్టు ధ్రువీకరించినా.. పైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.



# బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం అడ్డుకోగలదా ? – సుప్రీంకోర్టు



అణు విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి ప్రజలకు నష్టం జరిగితే.. పరిహారం ఇప్పించే అధికారం కోర్టులకు ఉంటుందా? లేదా కొత్త అణు చట్టంలోని పరిమితులే వర్తిస్తాయా? అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత సంస్థ చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.3,000 కోట్లకు పరిమితం చేయడంపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం ధర్మాసనం విచారించింది. ఐఏఎస్ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ నేతృత్వంలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఈ చట్టాన్ని సవాల్ చేశారు. అణు ప్రమాదం జరిగితే బాధ్యత వహించే సంస్థలపై పరిమితుల (శాంతి చట్టం ద్వారా) వల్ల.. భద్రత విషయంలో నిర్లక్ష్యానికి అవకాశం ఉంటుందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.
వాదనలు విన్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. ''ప్రమాద బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించకుండా ఆ చట్టం అడ్డుకోగలదా?'' అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి అణు విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకే ఈ పరిమితిని విధించినట్లు అభిప్రాయపడింది. అణు ప్లాంట్ల పర్యవేక్షణ సంస్థ నియామకాల్లో పారదర్శకతపై కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నియంత్రణ సంస్థ సభ్యుల నియామకంలో ప్రయోజనాల సంఘర్షణ ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కీలక అంశాలపై తదుపరి విచారణలో కేంద్రం ఇచ్చే వివరణపై స్పష్టత రావాల్సి ఉంది. అణు రియాక్టర్లకు సంబంధించి 'సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ' (శాంతి) చట్టం2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే.

# పరీక్షల్లో అవకతవకలు.. ఎన్‌టీఏలో 50మందిపై వేటు

ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలపై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50మందికి పైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ వంటి పది కొత్త స్థానాల కోసం ప్రకటనలు జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. సైబర్ భద్రత, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి కూడా నిపుణులను తీసుకువస్తున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత పరీక్షా విధానాలను కచ్చితంగా పాటించాలని విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు, ఎయిర్‌గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, నివేదిక సమర్పించాలని ఎన్‌టీఏను ఆదేశించారు. సోమవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి.. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సహా ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కి వ్యతిరేకంగా ఇటీవల దిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా వేలాదిమంది యువతతో పాటు ప్రతిపక్షాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తాజాగా ప్రశ్నపత్రాల్లో పలు తప్పులు దొర్లాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో యూజీసీ నెట్ ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఎన్‌టీఏ ప్రకటించింది. మరుసటి రోజే ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.




# ఆలయ సమీపంలో తొక్కిసలాట.. ఏడుగురి మృతి..!



బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయ సమీపంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్రమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.

బెంగాల్‌లో ఎనిమిది మంది మృతి..

పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.

# డ్రగ్స్ పరీక్ష.. మరో ఇద్దరు ఎయిరిండియా పైలట్లు ఫెయిల్




దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా మరోసారి వార్తల్లో నిలిచింది. ఆ సంస్థకు చెందిన ఇద్దరు పైలట్లు డ్రగ్స్ పరీక్షలో విఫలమయ్యారు. ప్రాథమికంగా జరిగిన పరీక్షల్లో ఈ విషయం వెల్లడికాగా.. తుది ఫలితాలు రావాల్సి ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆ ఇద్దరిని ఎయిరిండియా తాత్కాలికంగా విధుల నుంచి పక్కనపెట్టింది. ఇటీవల పుకెట్ దిల్లీ ఎయిరిండియా విమానంలో పైలట్‌కు డోప్ టెస్టు నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో తాజా ఘటన మరింత చర్చనీయాంశంగా మారింది.
థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఆ సమయంలో ప్రయాణికులు, సిబ్బంది కలిపి విమానంలో 145 మంది ఉన్నారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రాథమిక పరీక్షలో పైలట్ ఇన్‌కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్షను నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది.

# వారికి మార్పు అర్థం కావడం లేదు.. ఉదయనిధి 'త్రిష' కామెంట్‌పై అన్నామలై



తమిళనాడులో టీవీకే చీఫ్ విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుడు కె. అన్నామలై కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే విజయం రాజకీయాలకు కొత్త ఊపిరినిచ్చిందని అన్నారు. అయితే ఈ ప్రభుత్వానికి దార్శనికత లేదని విమర్శించారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలపైనా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఓటర్లు కోరుకుంటున్న మార్పును అంగీకరించేందుకు అవి సిద్ధంగా లేవని దుయ్యబట్టారు. 'ఇండియాటుడే రౌండ్‌టేబుల్-తమిళనాడు'లో పాల్గొన్న ఆయన.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నటి త్రిషపై డీఎంకే నేత, మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ఖండించారు .
ఆడవారిని, అమ్మను రాజకీయాల్లోకి లాగడం, దూషించడం వంటి పాత పద్ధతుల్లోనే ఉండాలని కొందరు నాయకులు అనుకుంటున్నారని అన్నామలై దుయ్యబట్టారు. రాజకీయ వారసులు క్షేత్రస్థాయిలో మార్పును అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. అలాగే తమిళనాడులో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారిని 'భాజపా బీ టీమ్' అని పేర్కొనడం దురదృష్టకరమన్నారు. ఆయన ఇటీవల భాజపా నుంచి బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఇక, ఎన్నికల సమయంలో విజయ్ పార్టీకి కూడా భాజపా బీ టీమ్ అని విమర్శలు వచ్చాయి.
ఇదిలా ఉంటే.. కావేరీ నదీ జలాల అంశంపై జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ పరోక్షంగా నటి త్రిష ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చినా.. ఫలితం లేకపోయింది. ఉదయనిధి వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపడంతో పాటు ఆయన అరెస్టు అవ్వాల్సి వచ్చింది.



# ప్రతిభ ఎంతున్నా ఫలితాలు అంతంతే!

భారత్ ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని, శాస్త్రీయ శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రపంచస్థాయి యువ శాస్త్రవేత్తలను తయారుచేస్తోంది. ప్రతిభను కనుగొనడంలో ఇండియా ఆరితేరినా, దాన్ని నిలబెట్టుకోవడంలో మాత్రం విజయవంతం కాలేకపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ తన మేధోసంపత్తిని ఉపయోగించి ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను సృష్టించగలదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక దేశం విజయానికి అసలైన కొలమానం- అక్కడ తయారయ్యే నిపుణ విద్యార్థుల సంఖ్య ఒక్కటే కాదు, వారిలో నుంచి ఎదిగి వచ్చే నవీకరణ సాధకులు, వ్యవస్థాపకుల సంఖ్య కూడా. మరి ఈ విషయంలో భారత్ ఎలా ముందుకెళ్లాలి?

దక్షిణ అమెరికాలోని కొలంబియా దేశం నుంచి ఇటీవల అయిదుగురు భారతీయ టీనేజర్లు పతకాలతోపాటు అంతకంటే విలువైనదానితో స్వదేశానికి తిరిగి వచ్చారు. మన దేశపు మహాసంపద- ప్రతిభేనని వారు గుర్తుచేశారు. జులైలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో ఇండియా తరపున పాల్గొన్న అయిదుగురు సభ్యుల బృందం అయిదు బంగారు పతకాలను గెలుచుకుంది. తద్వారా చైనా, రష్యా, దక్షిణ కొరియా, కజక్‌స్థాన్, తైవాన్ వంటి శాస్త్రవిజ్ఞాన దిగ్గజాలతోపాటుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 85 దేశాల నుంచి వచ్చిన 381 మంది అత్యంత ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులతో భారతీయులు పోటీపడ్డారు. పాఠ్యపుస్తకాల ద్వారా నేర్చినదాన్ని కాకుండా, అసలైన ఆలోచనాశక్తిని డిమాండ్ చేసే కఠినమైన అయిదు గంటల పరీక్షల్లో భారతీయ బృందం సత్తా చాటింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థ ఆధ్వర్యంలోని హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బీసీఎస్‌ఈ) సుమారు మూడు దశాబ్దాలుగా చేసిన కృషి ఫలితమే ఇది. గత దశాబ్దంలో ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో తలపడిన ప్రతి భారతీయ ప్రతినిధి పతకంతో తిరిగి వచ్చారు. వాటిలో దాదాపు మూడింట రెండొంతులు పసిడివే. అయితే, ఈ అద్భుత విజయం వెనక ఒక ఆందోళనకరమైన వాస్తవముంది. హెచ్‌బీసీఎస్‌ఈ ప్రకారం, భారతీయ ఒలింపియాడ్ పతక విజేతల్లో దాదాపు 64శాతం మంది పీహెచ్‌డీ చేసేవారే. కానీ, వారిలో 32శాతం మందే ఇండియాలో ఉంటున్నారు. మిగతావారు అవకాశాల అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లిపోతున్నారు.

స్టార్టప్‌ల సృష్టిలో ముందున్నాం కానీ...

స్టార్టప్‌లు పరిశోధనలను ఉత్పత్తులుగా మారుస్తాయి. పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధిని సృష్టించి, ఉత్పాదకతనూ పెంచుతాయి. ఒక స్టార్టప్ వంద కోట్ల డాలర్ల విలువను సాధించడం ద్వారా యూనికార్న్‌గా మారుతుంది. ప్రపంచంలో స్టార్టప్‌ల సంఖ్యలో అమెరికా, చైనాల తరవాతి స్థానం ఇండియాదే. వందకు పైగా భారతీయ స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా నిలిచాయి. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆధార్, యూపీఐల విస్తరణ, మెరుగైన ఇంటర్నెట్ కనెక్టివిటీ, నిపుణ యువ జనాభా... ఇవన్నీ కలిసి నవకల్పనలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయి. భారతీయ స్టార్టప్‌లు ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఏఐ, రవాణా, హరిత ఇంధనాలు, అంతరిక్ష సాంకేతికతల్లో నిమగ్నమయ్యాయి. లక్షలాది వినియోగదారులకు సేవలు అందిస్తూ నాణ్యమైన ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి.


ఫిన్‌టెక్‌లో నితిన్, నిఖిల్ కామత్‌లు స్థాపించిన జెరోధా తక్కువ ఖర్చుతో కూడిన బ్రోకరేజ్ ద్వారా రిటైల్ ఇన్వెస్టింగ్‌ను మార్చేసింది. పైన్‌లాబ్స్ మర్చంట్ కామర్స్ డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామిగా అవతరించింది. ఫల్గుణి నాయర్ స్థాపించిన నైకా టెక్నాలజీ భారతదేశ సౌందర్య రిటైల్ పరిశ్రమను విప్లవాత్మకంగా మార్చింది. లెన్స్‌కార్ట్ కళ్లద్దాల మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. బెంగళూరుకు చెందిన సర్వమ్‌ఏఐ భారతదేశపు మొట్టమొదటి ప్రధాన జెన్-ఏఐ యూనికార్న్‌గా అవతరించింది. ఇది భారతీయ భాషల కోసం ప్రత్యేకించిన సావరిన్ లాంగ్వేజ్ మోడల్స్, స్పీచ్ టెక్నాలజీలను అభివృద్ధి చేస్తోంది. హెల్త్‌కేర్ ఇన్నోవేషన్‌కు ఇన్నోవాసర్ వంటి కంపెనీలు ప్రతినిధులుగా నిలుస్తున్నాయి. మన వ్యవస్థాపకులు ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను నిర్మించగలరనేందుకు ఈ కంపెనీలన్నీ నిదర్శనాలే.

భారత సంతతి వ్యవస్థాపకులు విదేశాల్లో 150కి పైగా యూనికార్న్‌లను సృష్టించారు. ఒక్క అమెరికాలోనే 96 యూనికార్న్‌లను నెలకొల్పారు. ఐఐటీ మద్రాస్ పట్టభద్రుడు అరవింద్ శ్రీనివాస్ సహవ్యవస్థాపకుడిగా ఉన్న పెర్‌ప్లెక్సిటీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. 100 బిలియన్ డాలర్లకు పైగా విలువైన డేటాబ్రిక్స్- ఏఐ, క్లౌడ్ డేటా అనలిటిక్స్‌లో ప్రపంచ నేతగా మారింది. నిజానికి భారతీయులు ఇక్కడికంటే విదేశాల్లోనే ఎక్కువగా యూనికార్న్‌లను నిర్మించారు. ఎందుకంటే, అమెరికా వంటి దేశాల్లో స్టార్టప్‌లకు మన దగ్గరకంటే ఎక్కువ పెట్టుబడులు లభిస్తాయి. స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ వంటి ఉన్నత విద్యాలయాలు పరిశోధకులను ప్రోత్సహిస్తాయి. వారు పరిశ్రమలతో కలిసి పనిచేస్తారు. మేధోహక్కులకూ రక్షణ లభిస్తుంది. స్టాక్-ఆప్షన్ విధానాలు, ప్రపంచ మార్కెట్లు అందుబాటులో ఉంటాయి. చైనీయుల యూనికార్న్‌లు మాత్రం స్వదేశంలోనే ఎక్కువగా ఉన్నాయి. చైనా తన ప్రతిభను విజయవంతంగా నిలుపుకొని, వాణిజ్యీకరించింది. దీనికి విరుద్ధంగా, భారత్ తన అత్యంత ప్రతిభావంతులైన ఆవిష్కర్తల్లో అత్యధికులను ఎగుమతి చేస్తూనే ఉంది. ప్రతిభను వాణిజ్యీకరించడం ఇంకా నేర్చుకుంటూనే ఉంది.

భారత్‌లో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, రోబోటిక్స్ రంగాల్లో పరిశోధన-అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. ఉన్నత విద్యాసంస్థలు నవ కల్పనలకు, వ్యవస్థాపకతకు కేంద్రాలుగా మారాలి. బోధన సిబ్బంది, విద్యార్థులు పరిశోధనలను వాణిజ్యీకరించేలా ప్రోత్సహించాలి. స్వదేశంలో భారీ వెంచర్ క్యాపిటల్ నిధులను సృష్టించాలి. డీప్-టెక్నాలజీ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించాలి. వ్యవస్థాపకులు అనుమతుల కోసం కాకుండా ఆవిష్కరణలపై అధిక సమయం వెచ్చించేలా సాయపడాలి. పేటెంట్లు, మేధోసంపత్తి హక్కులను వేగంగా అందించడంతో పాటు టెక్నాలజీ లైసెన్సింగ్‌ను సులభతరం చేయాలి. విదేశాల్లో విజయవంతమైన భారత సంతతి వ్యవస్థాపకులను సలహాదారులుగా, పెట్టుబడిదారులుగా, సహచరులుగా మార్చుకోగలిగితే... ప్రపంచస్థాయి వ్యాపార సంస్థలను నిర్మించడం తేలికవుతుంది.

# 'హెచ్‌ఐ ఎందుకు ప్రత్యేకం'?

**మీరు కేవలం ఒక కాలేజీ నుంచి పట్టా పొందడం కాదు, సమాజంలో మార్పు తీసుకురావాలనే ఒక గొప్ప ఉద్యమంలో భాగమై బయటకు అడుగుపెడుతున్నారు. ఇప్పుడు నేను ఈ రోజుల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన రెండు అక్షరాలు పలకబోతున్నాను: ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్). 2026లో అత్యంత వివాదాస్పదమైన అంశం జాతి, లింగం లేదా వలస పాలన కాదు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ అవుతుందని ఎవరు ఊహించారు? కానీ నేను నిజానికి ఏఐ గురించి మాట్లాడాలనుకోవడం లేదు. నేను మాట్లాడాలనుకుంటున్నది హెచ్‌ఐ (హ్యూమన్ ఇంటెలిజెన్స్– మానవ మేధస్సు) గురించి. కృత్రిమ మేధ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చెందుతోంది. దాని శక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఏఐ శక్తి ఎంత పెరిగినా, మనుషులు అవసరం లేనివారిగా మారిపోరు.**



మనిషి మాత్రమే చేయగలిగేది?

ప్రతి తరం ప్రపంచాన్ని మార్చేసే కొత్త సాంకేతిక విప్లవా లను చూసింది. ముద్రణ యంత్రం వచ్చింది. ఆవిరి యంత్రం వచ్చింది. విద్యుత్ వచ్చింది. ఇంటర్నెట్ వచ్చింది. ప్రతి కొత్త ఆవిష్కరణ ఒకవైపు ఆశ్చర్యాన్ని కలిగిస్తే... మరోవైపు భయాన్ని కూడా కలిగించింది. ఇప్పుడు వాటన్నింటికంటే పెద్ద మార్పును తీసుకొస్తున్న సాంకేతికతగా ఏఐ మన ముందుకు వచ్చింది. ఇది వ్యాసాలు రాయగలదు. సంగీతాన్ని సృష్టించగలదు. వ్యాధు లను గుర్తించగలదు. క్లిష్టమైన గణిత సమస్యలను పరిష్కరించ గలదు. వీడియోలను రూపొందించగలదు. మనుషుల్లా మాట్లాడగలదు. అందుకే చాలామంది ఒక ప్రశ్న అడుగు తున్నారు: 'ఇక మనుషులకు మిగిలేది ఏమిటి?' కానీ బహుశా ఇది తప్పు ప్రశ్న కావచ్చు. అసలు అడగాల్సిన ప్రశ్న ఏమిటంటే... ఏఐ రావడం వల్ల మనుషుల ప్రత్యేకత ఏమిటో మనకు ఏం అర్థమవుతోంది? మనిషిగా ఉండటం అంటే ఏమిటి? మనల్ని ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటి? అనే విషయాన్నిమరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం ఇప్పుడు మనకు లభించింది. మనుషులు మాత్రమే చేయగలిగే, యంత్రాలు ఎప్పటికీ చేయలేనివి ఏమిటి? ఈ ప్రశ్నకు దొరికే సమాధానం మన భవిష్యత్తుకు ఎంతో విలువైనది. ముందుగా మనిషి మెదడు గురించి ఆలోచించండి. అది నిజంగా ప్రకృతి సృష్టించిన ఒక అద్భుతం. మనిషి మెదడు బరువు సుమారు ఒకటిన్నర కిలోలే. అది పనిచేయడానికి కేవలం ఇరవై వాట్ల శక్తి సరిపోతుంది. అయితే ప్రపంచంలోని అత్యాధునిక ఏఐ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వాలంటే, కోట్లాది వాట్ల విద్యుత్‌ను వినియోగించే భారీ డేటా సెంటర్లు అవసరం. ఆ విద్యుత్‌తో మొత్తం ఒక నగరాన్నే నడప వచ్చు. అదే సమయంలో మీ తలలో ఉన్న మెదడు ఒక ల్యాప్‌టాప్ ఛార్జర్ కంటే తక్కువ శక్తితో నిశ్శబ్దంగా పనిచేస్తూనే ఉంటుంది.

ఒక చిన్న పిల్లవాడు మసక వెలుతురులో కూడా ఒక ముఖాన్ని వెంటనే గుర్తుపట్టగలడు. గొంతులోని భావాన్ని అర్థం చేసుకోగలడు. వ్యంగ్యం, సందిగ్ధత, ఆప్యాయత, సిగ్గు, ప్రేమ, హాస్యం, బాధ వంటి భావాలను మనం చాలా సహజంగా అర్థం చేసుకుంటాం. ఒక గదిలోకి వెళ్లగానే అక్కడి వాతావరణాన్ని గ్రహిస్తాం. నిశ్శబ్దంలో కూడా ఉద్రిక్తతను గుర్తిస్తాం. చిరునవ్వు లోని కృత్రిమతను కూడా కనిపెట్టగలుగుతాం. యంత్రాలు విశ్లే షణలో గొప్పవే. కానీ మనుషులు కేవలం విశ్లేషణ చేసే జీవులు కాదు. మనం ఇతర మనుషులతో కలిసి జీవించే సామాజిక జీవులం. ఒక యంత్రం బాధతో కూడిన కవిత రాయగలదు. కానీ అది అంత్యక్రియల్లో కన్నీరు పెట్టుకోలేదు. ప్రేమలేఖ రాయగలదు. కానీ ప్రేమలో పడలేదు. భయం గురించి వివరించగలదు. కానీ అర్ధరాత్రి మేల్కొని తన జీవితాన్ని వృథా చేసుకున్నానేమో అని ఆందోళన చెందలేదు. ఇదే మనిషిని ప్రత్యేకంగా నిలబెడుతుంది.

అసంపూర్ణతే అందం

జపాన్ లో 'వాబి-సాబి' అనే గొప్ప తత్వం ఉంది. అది అసంపూర్ణతను కీర్తిస్తుంది. అక్కడ చేతితో తయారైన మట్టి పాత్రలు కొద్దిగా వంకరగా ఉండొచ్చు. రంగు సమానంగా లేకపోవచ్చు. అయినా వాటికే ఎక్కువ విలువ ఉంటుంది. ఎందు కంటే, వాటిలో ఒక మనిషి స్పర్శ కనిపిస్తుంది. కొన్నిసార్లు విరిగిపోయిన పాత్రలను బంగారు మిశ్రమంతో అతికిస్తారు. దానిని 'కింట్సుగి' అంటారు. ఆ పగుళ్లను దాచిపెట్టరు. వాటినే అందంగా చూపిస్తారు.

ఎందుకంటే, ఆ పగుళ్లు కూడా ఆ పాత్ర జీవితంలో ఒక భాగమే. మనిషి జీవితమూ అంతే. మన గాయాలు, మన వైఫల్యాలు, వాటి నుంచి కోలుకున్న తీరు... ఇవే మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. యంత్రాలు వేలాది దుస్తులను ఒకే విధంగా తయారు చేయగలవు. అయినా ప్రపంచంలో అత్యంత ఖరీదైన దుస్తులు ఇప్పటికీ చేతితో కుట్టినవే. ఎందుకంటే, వాటిలో యంత్రాల పరిపూర్ణత కాదు, మనిషి నైపుణ్యం కనిపిస్తుంది. మనుషులు ఎప్పుడూ పరిపూర్ణతనే వెతకరు. చాలాసార్లు నిజాయితీని వెతుకుతారు. ఆత్మను వెతుకుతారు.

ఏఐ యుగంలో అసలు ప్రమాదం యంత్రాలు మనుషుల్లా మారడంలో లేదు. మనుషులే యంత్రాల్లా మారాలని ప్రయ త్నించడంలో ఉంది. ఇప్పటికే మనం దానిని చూస్తున్నాం. ప్రతి విషయాన్నీ 'ఆప్టిమైజ్' చేయాలని ప్రయత్నిస్తున్నాం. నిద్ర, ఉత్పాదకత, పరిచయాలు, పనితీరు. ప్రతి దాన్నీ సంఖ్యలతో కొలవాలనుకుంటున్నాం. విద్యార్థులు తమ జీవితాన్ని ఒక పరి పూర్ణ బయోడేటాగా మార్చుకోవాలని ఒత్తిడికి గురవుతున్నారు. ఉద్యోగులు అలసట తెలియని అల్గారిథమ్‌లతో తమను తాము పోల్చుకుంటూ భయపడుతున్నారు. కానీ మానవ జీవితం పరిపూర్ణత వల్ల కాదు. మానవత్వం వల్ల గొప్పదవుతుంది.

మన జీవితాలను ఎక్కువగా ప్రభావితం చేసే వారు ఎప్పుడూ అత్యంత సమర్థులే కావాల్సిన అవసరం లేదు. వారు అత్యంత మానవత్వం కలిగినవారు. మీపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన ఒక ఉపాధ్యాయుడు, బాధలో మీతో పాటుగంటల తరబడి కూర్చున్న ఒక స్నేహితుడు, మీ కోసం ఎన్నో సంవత్సరాలు త్యాగాలు చేసిన తల్లిదండ్రులు, ప్రాణాలకు ముప్పు వచ్చినా తన ఆశయాన్ని వదలని ఒక సామాజిక కార్యకర్త... ఇలాంటి వారే మన జీవితాలను మార్చుతారు.

ఏఐతో లోపం లేని ఒక అద్భుతమైన సంగీతాన్ని రూపొందించవచ్చు. ప్రపంచంలోనే అత్యుత్తమ సంగీత కృతుల్లో ఒకటైన తొమ్మిదో సింఫనీని బీథోవెన్ దాదాపు పూర్తిగా చెవిటి వాడైన తర్వాత స్వరపరిచాడు. ఆ సంగీతాన్ని విన్నప్పుడు మనల్ని కదిలించేది కేవలం స్వరాల అందం కాదు. తాను ఎప్పటికీ వినలేని సంగీతాన్ని సృష్టించాలనే ఒక మనిషి సంకల్పం, అతని బాధ, అతని పట్టుదల. అందుకే మానవ మేధస్సు ఎంతో విలువైనది. దానిలో చైతన్యం ఉంది. భావోద్వేగాలు ఉన్నాయి. జీవిత అనుభవాలు ఉన్నాయి.

ఏఐ వైద్యం, విజ్ఞానం, విద్య, రవాణా, పరిశ్రమలు దాదాపు ప్రతి రంగాన్నీ మార్చబోతోంది. కొన్ని ఉద్యోగాలు మారిపోతాయి. కొత్త ఉద్యోగాలు వస్తాయి. పూర్తి పరిశ్రమలే రూపాంతరం చెందుతాయి. కానీ ఈ మార్పులన్నింటి మధ్య కూడా, మనుషులు కోరుకునేది మాత్రం మనుషులనే. తమ పిల్లలకు బోధించడానికి, అనారోగ్యంలో ధైర్యం చెప్పడానికి, సంక్షోభ సమయంలో నాయకత్వం వహించడానికి, మనిషి జీవితాన్ని ప్రతిబింబించే కళను సృష్టించడానికి... ఇంకా ముఖ్యంగా... ఒకరికి ఒకరు విలువైన వారిగా ఉండడానికి మనుషులే అవసరం. మానవ జీవితం సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.

నా కోరిక ఒక్కటే. మీరు ఏఐతో పోటీ పడకండి. దాని బలాలను అనుకరించకండి. దానికి బదులుగా మరింత మంచి మనుషులుగా మారండి. నైపుణ్యాన్ని మాత్రమే కాదు, వివేకాన్ని పెంచుకోండి. సమాజంతో కలిసి జీవించడం నేర్చుకోండి. నమ్మకాన్ని సంపాదించడం నేర్చుకోండి. క్షమించడం నేర్చుకోండి. మనస్ఫూర్తిగా నవ్వడం నేర్చుకోండి. ఎందుకంటే... చివరికి మనం అత్యంత విలువైనదిగా భావించేది, లోపాలు లేని తెలివితేటలను కాదు. లోపాలున్నా ప్రేమించగల మానవత్వాన్ని. అవును... వ్యాధులను నయం చేయడానికి, విజ్ఞానాన్ని విస్తరించడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, ఉత్పాదక తను పెంచడానికి... ఇప్పటివరకు అసాధ్యంగా భావించిన సమ స్యలను పరిష్కరించడానికి... ఏఐని తప్పకుండా ఉపయోగించండి. అదే సమయంలో... మనిషి మెదడు ఎంత అద్భుతమో ప్రపంచానికి తెలియజేయడానికి కూడా ఏఐని ఉపయోగించండి.

# విద్యుత్ సంస్కరణలతో లాభమెంత?

**భారతదేశ విద్యుత్ రంగం కీలక దశలోకి ప్రవేశించిన సందర్భంలో 'ముసాయిదా విద్యుత్(సవరణ) బిల్లు-2025' తెరపైకి వచ్చింది. దేశంలో బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలతో పాటు... శిలాజేతర, పునరుత్పాదక వనరులతోనూ పెద్దయెత్తున కరెంటు ఉత్పత్తి అవుతోంది. అయితే, స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో సగానికి పైగా వాటా శిలాజేతర ఇంధన వనరులదే. ఇప్పుడు చేయాల్సిందల్లా ఆ సామర్థ్యాన్ని పంపిణీకి అనుకూలంగా, సరసమైన ధరలో లభ్యమయ్యేలా, స్థానికంగా వాడుకోదగినదిగా ఉండేట్లు చూడటమే. సరిగ్గా ఇక్కడే ప్రతిపాదిత బిల్లు అసంపూర్ణంగా కనిపిస్తోంది. అదే సమయంలో విద్యుత్ వ్యవస్థలో మారుతున్న అనేక అంశాలను అది గుర్తించింది.విద్యుత్ వ్యవస్థ చట్టపరమైన నిర్వచనంలోకి ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను తీసుకురావడం ముసాయిదా విద్యుత్(సవరణ) బిల్లులో ఒక విశేషాంశం. శిలాజేతర, పునరుత్పాదక ఇంధనాల ద్వారా ఉత్పత్తి అవుతున్న కరెంటుకు ఉత్పాదక వ్యయం ఆధారంగా ఛార్జీలను నిర్ణయించడంతో పాటు విద్యుత్ పంపిణీలో పోటీకి స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించాలని ఈ బిల్లు పేర్కొంది. విద్యుదుత్పాదన, పంపిణీ, వినియోగాలకు సంబంధించి కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు విద్యుత్ మండలిని ఏర్పాటు చేయడం వంటి ప్రతిపాదనలనూ ఇది ముందుకు తెచ్చింది. కానీ, ఈ బిల్లు పునరుత్పాదక విద్యుదుత్పాదన, పంపిణీ, నిల్వ వంటి అంశాల్లో ఏకీకృత**




**వ్యవస్థను ఏర్పాటు చేసేలా రాష్ట్రాలకు తగినంత అధికారాన్ని ఇవ్వడం లేదు. భారత్ శిలాజ ఇంధనాల నుంచి హరిత విద్యుదుత్పాదనకు మారుతున్న క్రమంలో తదుపరి సవాళ్లు జాతీయస్థాయికి మాత్రమే పరిమితం కాబోవు. రాష్ట్ర గ్రిడ్లు, రాష్ట్ర నియంత్రణ సంస్థలు, స్టేట్ లోడ్-డిస్పాచ్ సెంటర్లు, రాష్ట్ర పంపిణీ సంస్థల్లో అవి తలెత్తుతాయని గుర్తుంచుకోవాలి. ఆ ప్రకారం చూసినప్పుడు, ప్రతిపాదిత బిల్లులోని మూడు కీలక లోపాలను అధిగమించాల్సి ఉంది.**

సమయానుకూల లభ్యత ముఖ్యం

విద్యుత్ నిల్వ వ్యవస్థ అంటే కరెంటును నిల్వచేసి, అవసరమైనప్పుడు సరఫరా చేయగల ఆస్తి అని ముసాయిదా బిల్లు సరిగ్గానే నిర్వచించింది. ఇప్పుడు సవాలు విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని పెంచడం కాదు, సమయానుకూలంగా కరెంటు లభ్యమయ్యేలా చూడటం. మధ్యాహ్నం వేళ సౌర విద్యుత్ సమృద్ధిగా ఉత్పత్తి అవుతుంది. కానీ, అది తగ్గిపోయే సాయంత్రం పూట గరిష్ఠ డిమాండ్ రావచ్చు. వడగాడ్పులతో కూడిన వాతావరణం విద్యుత్ డిమాండ్‌ను అస్థిరంగా మారుస్తోంది. పరిశ్రమలు, దుకాణాలతో పాటు ఇళ్లలోనూ కూలింగ్ అవసరాలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ ధారాళంగా ఉత్పత్తి అయినప్పుడు నిల్వచేసి, అవసరమైనపుడు వాడుకోవడానికి వీలుగా తగిన ప్రణాళికతో ఒక వ్యవస్థను నిర్మించాల్సి ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకం ఇంధన వనరులు దండిగా లభిస్తాయి. ఉదాహరణకు తమిళనాడు పవన శక్తి ఆధారిత విద్యుదుత్పాదన వ్యవస్థకు ప్రసిద్ధి చెందితే, ఝార్ఖండ్ బొగ్గు ఆధారిత విద్యుత్తుకు కేంద్రంగా నిలుస్తోంది. రాష్ట్రాల మధ్య ఇంధన వనరులు, ఉత్పాదన, పంపిణీపరంగా వ్యత్యాసాలు ఉంటాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రస్థాయి వ్యవస్థలను నిర్మించుకోవాలి. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రమన్నట్లు కేంద్రస్థాయి విధులు బాధ్యతలనే అన్ని రాష్ట్రాలపై రుద్దకూడదు. ప్రతి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ తనకున్న ఇంధన వనరులను ఉపయోగించుకుంటూ విద్యుదుత్పాదన చేసేలా ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఈ రాష్ట్రస్థాయి ప్రణాళికలు గరిష్ఠ డిమాండ్, కాలానుగుణ వైవిధ్యం, నిల్వ అవసరాలు, గిరాకీసరఫరా సామర్థ్యాలను అంచనా వేయాలి. ఇలాంటి విధానం లేకపోతే రాష్ట్రాలు సరైన సమయంలో సరిపడా విద్యుత్తును పంపిణీ చేయగల యంత్రాంగాల ఏర్పాటుకు తొందరపడవు. మరోవైపు, జాతీయ స్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుదుత్పాదన పెరిగిపోతూ, తీవ్ర అసమతుల్యతకు దారితీస్తోంది.

ఒక రాష్ట్రం లోపల, వివిధ రాష్ట్రాల మధ్య విద్యుత్ ప్రసారం కోసం తగిన యంత్రాంగం ఉండాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. కానీ, ఈ పని సమగ్ర జాతీయ యంత్రాంగం ద్వారా జరగాల్సిందని గుర్తించకపోవడం రెండో లోపం. దేశంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు నిర్దిష్ట ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. ఆ విద్యుత్తుకు ఇతర ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రాల్లో కూడా పునరుత్పాదక విద్యుదుత్పాదన అధికంగా ఉన్న జిల్లాల నుంచి సబ్‌స్టేషన్లు, పరిశ్రమలు, నగరాలు, పంపిణీ నెట్‌వర్క్‌లకు విద్యుత్తును సరఫరా చేయాలి. లేకుంటే సదరు హరిత విద్యుత్ వృథా కావడమో, ఉత్పత్తి అయ్యే చోటే నిలిచిపోవడమో జరుగుతుంది. కొన్ని రాష్ట్రాల్లో పునరుత్పాదక విద్యుదుత్పత్తిని వినియోగ సామర్థ్యానికి మించి వేగంగా పెంచుతున్నారు. కాబట్టి, ముసాయిదా బిల్లు రాష్ట్రాల్లోని గ్రిడ్‌ల సామర్థ్యాన్ని నానాటికీ పెరుగుతున్న విద్యుదుత్పాదన ప్రసారాలకు అనుగుణంగా పెంచాలి. పునరుత్పాదక విద్యుదుత్పాదన అధికంగా ఉన్న రాష్ట్రాలు కర్బన ఉద్గారాల పరిహరణ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. కాబట్టి, వాటికి భూ సంబంధిత పరిహారం, సమతుల్య మౌలిక సదుపాయాలు, నిల్వ విస్తరణకు అయ్యే ఖర్చును కేంద్రం భరించాలి.

సమ భాగస్వాములు కావాలి...

తాజా బిల్లు శిలాజేతర విద్యుత్ కోసం మార్కెట్ యంత్రాంగాలను ప్రోత్సహించాలని కోరుతోంది. కానీ పునరుత్పాదక విద్యుదుత్పాదన వ్యవస్థలో డిమాండ్ ఏ సమయంలో మారుతుంది? గ్రిడ్‌కు విద్యుత్ నిల్వ సామర్థ్యం ఎంతమేర ఉంది? అనే అంశాలు కీలకం. ఇలాంటి విషయాల్లో రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ సంస్థలకు క్రియాశీల పాత్రను ఇవ్వడంతో పాటు గిరాకీ సమయాన్ని బట్టి సుంకాలను నిర్ణయించే అధికారాన్నీ ఇవ్వాలి. స్టోరేజీ నిర్వహణ వంటి అంశాల్లో ఎక్కువ బాధ్యతను అప్పగించాలి. దేశీయ పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని నికరమైనదిగా, లాభదాయకమైనదిగా, అభివృద్ధికి ఉపయోగకరమైనదిగా ఉండే వ్యవస్థతో అనుసంధానించడం ముఖ్యం. హరిత విద్యుదుత్పాదన, సరఫరా, నిల్వ సమర్థంగా జరగడానికి తగిన వ్యవస్థను నిర్మించడం అత్యవసరం. అందులో కేంద్రం, రాష్ట్రాలు సమంగా భాగస్వాములు కావడం అత్యావశ్యకం.

# 'సహజీవన' హింస నేరమే!

**సహజీవన బంధాల్లో క్రూరత్వాన్ని ఎదుర్కొనే మహిళలకు ఊరటనిచ్చేలా గృహహింస చట్టం పరిధిని విస్తరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వెలువరించిన తీర్పు మహిళలకు ఊరటనిస్తుంది. యుక్త వయసు వచ్చిన జంట పరస్పర అంగీకారంతో వివాహ వ్యవస్థ వెలుపల కూడా సహజీవనం సాగించవచ్చంటూ గతంలో న్యాయస్థానాలు పలు సందర్భాల్లో తెలిపాయి. అయినా ఇలాంటి బంధాలు తరచు వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా కొన్ని రాష్ట్రాల హైకోర్టులు వేర్వేరు కేసుల్లో ఈ బంధాల్లోని నైతికతను ప్రశ్నిస్తూనే ఉన్నాయి. వివాహ బంధాల్లో ఉండే రక్షణలు సహజీవన బంధాల్లో ఉండబోవని హితోక్తులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 'వివాహ స్వభావం కలిగిన' సహజీవన బంధంలో ఉండే భాగస్వామి నుంచి మహిళ హింసను ఎదుర్కొంటే ఐపీసీ సెక్షన్ 498ఏ(బీఎన్ఎస్ సెక్షన్లు 85, 86) కింద కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. పరస్పర అవగాహన ద్వారా ఒక జంట సహజీవనం చేస్తున్నప్పుడు ఆమెను హింసించే పరిస్థితులు తలెత్తినప్పుడు చట్టం ఆమెకు రక్షణగా నిలబడాలి. ఇప్పుడు తాజా తీర్పువల్ల అలాంటి మహిళలకు భద్రత ఉంటుంది.**

నాలుగు దశాబ్దాల క్రితం చట్టం ఇంత స్పష్టంగా లేదు. అసలు మన చట్టాల్లో సహజీవన సంబంధాలకు ఎప్పుడూ చోటులేదు. కానీ 2005లో వచ్చిన గృహహింస నిరోధక చట్టం తొలిసారి 'వివాహ స్వభావం' కలిగిన సంబంధంలో ఉన్న మహిళ సమస్యలు ఎదుర్కొంటున్న పక్షంలో ఆమెను బాధిత పక్షంగా గుర్తించింది. ఆడ, మగ ఒకే ఇంట్లో కలిసివుంటూ జీవితభాగస్వాములన్న అభిప్రాయం సమాజంలో కలిగిస్తే, వారు పెళ్లీడుకొచ్చివుంటే, తగినంతకాలం శారీరక సంబంధంలో కొనసాగుతూవుంటే ఆ బంధాన్ని 'వివాహ స్వభావం'గల బంధంగా గుర్తించవచ్చని సుప్రీంకోర్టు 2011లోనే ఒక కేసులో చెప్పింది. వారాంతాల్లో కలిసివున్నప్పుడు ఇది వర్తించబోదని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పు పెళ్లికానంత మాత్రాన ఒక బంధంలో కొనసాగే పురుషుడు మహిళను హింసిస్తుంటే 498ఏ వర్తించబోదనటం సరికాదని వివరించింది. చట్టంలోని 'భర్త' అనే పదాన్ని మరీ సంకుచితంగా తీసుకుని యాంత్రికంగా వర్తింపజేసి బాధిత మహిళకు న్యాయం చేయకపోవటం సరికాదని ధర్మాసనం చెప్పడం గమనించదగింది. లాంఛనంగా పెళ్లి ధ్రువీకరణ పత్రం లేనంతమాత్రాన ఆ బంధంలోని వివాహ స్వభావాన్ని గుర్తించకపోవటం, అక్కడ జరిగే హింసను విస్మరించటం సమాజ పురోగతికి తోడ్పడబోదని కూడా తెలిపింది.

ఇద్దరు వ్యక్తులు సహజీవన బంధంలోకి వెళ్లి, వారి మధ్య తలెత్తే విభేదాలు మహిళను హింసించటానికి దారితీస్తే దాన్ని నేరంగా పరిగణించకపోవటం ఎలా చూసినా సరికాదు. సహజీవనంలోవుండే మహిళకు గృహహింస చట్టంకింద ఉన్న రక్షణలు సరిపోతాయనీ, అందువల్ల 498ఏ పరిధిని విస్తరించటం అనవసరమనీ ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదించినా ధర్మాసనం దీన్ని దృష్టిలో ఉంచుకునే తోసిపుచ్చింది. గృహహింస చట్టం కేవలం మనోవర్తి, పరిహారం, ఇంట్లో కొనసాగే హక్కువంటి సివిల్ ఉపశమనాలు మాత్రమే ఇస్తున్నదని... ఆ నేరానికి తగిన శిక్ష ఉండొద్దా అని న్యాయమూర్తులు ప్రశ్నించటం గమనార్హం. ప్రస్తుత కేసులో మహిళ తాను వివాహానికి సిద్ధపడే ఈ సహజీవన బంధంలోకి ప్రవేశించాననీ, కానీ అప్పటికే అతగాడికి పెళ్లయిన విషయాన్ని దాచాడనీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ కేసులోని నిజానిజాల్లోకి పోకుండానే మహి□□ క్రూరత్వాన్ని చవిచూస్తుంటే 498ఏ వర్తించితీరాలని తెలిపింది.

చట్టాలు చేసే సందర్భాల్లో పార్లమెంటు అవగాహనకు రాని విషయాలు, అప్పటికి అలాంటి పరిస్థితులు లేని సందర్భాలు అనంతర కాలంలో తలెత్తవచ్చు. అంతమాత్రాన సమాజంలో వచ్చిన మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకుండా యాంత్రికంగా అన్వయించటంతో సరిపెడితే బాధితులకు ఎప్పటికీ న్యాయం దక్కదు. అయితే సహజీవనానికి సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేకపోవటం వల్ల ఇలాంటి బంధాల్లో ఏర్పడే సమస్యల విషయంలో వచ్చే కేసుల్ని న్యాయస్థానాలు పదే పదే విచారించి తేల్చవలసి వస్తున్నది. కనుక వర్తమాన సామాజిక స్థితిగతుల్ని దృష్టిలో ఉంచుకుని ఆ మాదిరి చట్టం అవసరాన్ని ప్రభుత్వం గుర్తించటం అవసరం.

# ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సత్తెనపల్లి ఆగస్టు 17 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (APUWJ) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి జర్నలిస్టులు వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి. సుబ్బారావు, పల్నాడు జిల్లా కమిటీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి యూనియన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ (WJHS) కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి బకాయిలు ఉన్నాయనే కారణంతో కొన్ని ఆసుపత్రుల్లో WJHS కార్డులను అనుమతించకపోవడంతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, దీనిపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ చర్యలను వేగవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల కోసం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులను అరికట్టి వారి వృత్తి స్వేచ్ఛకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక జర్నలిస్టుల భద్రతా చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జనరల్ సెక్రెటరీగా స్మృతి ఇరానీ




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17, అనంత జనశక్తి న్యూస్**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో భారీ సంస్థాగత మార్పులు చోటుచేసుకున్నాయి. బీజేపీ సోమవారం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీకి బాధ్యతలు అప్పగించారు. అలాగే, మరో 13 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించగా.. ఆరుగురు మహిళలే కావడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాంమాధవ్, పురందేశ్వరిలతో పాటు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకురాలు వసుంధర రాజే సింధియా అవకాశం దక్కింది. అయితే, తెలంగాణ నుంచి ఎవరికీ చోటుదక్కలేదు. ఇప్పటి వరకూ ఉపాధ్యక్షురాలిగా ఉన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను తప్పించారు.

జాయింట్ కోఆర్డినేటర్‌గా ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర కార్యాలయం ఇంఛార్జ్‌గా తరుణ్ చుగ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఓబీసీ విభాగం అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మణ్‌ను తప్పించి అమర్‌పాల్ మౌర్యను నియమించారు. ఆప్ నుంచి ఇటీవలే పార్టీలో చేరిన సందీప్ పాఠక్‌కు జాతీయ కార్యదర్శిగా నియమించారు. సీనియర్ నేత సంబిత్ పాత్రాకు ఈశాన్య ప్రాంతాల కోఆర్డినేటర్‌గా బాధ్యతలు కట్టబెట్టారు.

13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో వారికి మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తోంది. ముస్లిం వర్గానికి చెందిన ఇద్దరితో పాటు నలుగురు మహిళా కార్యదర్శులు, ఒక మహిళా ప్రధాన కార్యదర్శి కూడా ఉన్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ముఖ్య కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులు లభించాయి. ఉపాధ్యక్షులుగా తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్‌మాధవ్ (ఢిల్లీ), వైజయంత్ జే పాండే (ఒడిశా), పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), రేఖా వర్మ (ఉత్తర్ ప్రదేశ్0, సర్దార్ సింగ్ బాదల్ (పంజాబ్), వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి (గుజరాత్), డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ఎం నాగరాజ్ (కర్ణాటక), తారిక్ మన్సూర్ (ఉత్తర్ ప్రదేశ్), మధుచందాకర్ (పశ్చిమ్ బెంగాల్).

జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా ఉన్న బీఎల్ సంతోష్‌ను కొనసాగించారు. ముంబయికి చెందిన శివ్ ప్రకాష్, చండీగఢ్‌కు చెందిన సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. మీడియా కోఆర్డినేటర్‌గా అనిల్ బలూని, ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారి, సిద్ధార్థ యాదవ్ సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమించారు. దీపక్ మస్కేను సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా, ప్రీతి గాంధీ, శివానంద్ ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్ సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో బీజేపీ సమూల మార్పులు చేపట్టింది.

# అసెంబ్లీకి కొత్త ప్యానల్ స్పీకర్లు

**- ఆరుగురి పేర్లు ప్రకటించిన స్పీకర్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్యానల్ స్పీకర్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. శాసనసభ కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో భాగంగా ఆరుగురు సభ్యులను ప్యానల్ స్పీకర్లుగా నియమించారు. ప్యానల్ స్పీకర్లుగా మండలి బుద్ధ ప్రసాద్, కోళ్ల లలిత కుమారి, జ్యోతుల నెహ్రూ, విష్ణుకుమార్ రాజు, వరద రాజుల రెడ్డి, దాసరి సుధలను నియమించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శాసనసభ సమావేశాల సమయంలో స్పీకర్ అందుబాటులో లేని సందర్భాల్లో సభా కార్యక్రమాలను నిర్వహించడంలో ప్యానల్ స్పీకర్లు కీలక పాత్ర పోషిస్తారు. తాజాగా ప్రకటించిన ఈ నియామకాలతో సభా వ్యవహారాలు మరింత సజావుగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు.. డీఎస్సీ తో పాటు ఇతర అంశాలపై వైసీపీ అధినేత జగన్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు బయట, రోడ్లపై మాట్లాడటం కాకుండా ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. సభలోనే ప్రభుత్వం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన అయ్యన్నపాత్రుడు.. ఎక్కడో రోడ్లపై మాట్లాడిన అంశాలకు సమాధానం చెప్పాలంటే ఎలా అని ప్రశ్నించారు. జగన్ ఎమ్మెల్యేగా, ఆయన పార్టీకి చెందిన సభ్యులు శాసనసభకు వచ్చి తమ సమస్యలు, అనుమానాలను సభలో ప్రస్తావించాలని సూచించారు. జగన్‌కు ప్రస్తుతం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నేపథ్యంలో జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా తాను ఎలా ఇవ్వగలనని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదా అంశంపై గతంలోనూ తన వైఖరిని స్పష్టం చేసినట్లు తెలిపారు.

వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. సభలో సంబంధిత మంత్రులు అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు మంత్రులతో సమాధానాలు ఇప్పించే బాధ్యతను స్పీకర్‌గా తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాలు, ఇతర ప్రభుత్వ అంశాలపై వైసీపీకి ఏవైనా సందేహాలు ఉంటే వాటిని అసెంబ్లీ వేదికగా లేవనెత్తితే ప్రభుత్వం సమాధానం చెప్పే అవకాశం ఉంటుందని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై చర్చకు శాసనసభే సరైన వేదిక అని స్పష్టం చేశారు శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు..

# ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

**- ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి**
**- రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి**
**- యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలి**
**- హెల్త్ కార్డు అమలులో ఇబ్బంది లేకుండా చూడాలి**
**- జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి**
**ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**

**కర్నూలు, ఆగస్టు 17:అనంత జనశక్తి న్యూస్**



జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు మానిఫెస్టోలో పెట్టారని, కానీ ఇప్పటి వరకు దాని గురించి ఊసేలేదని, తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఇండియా జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మస్తాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవం పురస్కరించుకొని జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ఎస్) అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవు తున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో డబ్ల్యూజేహెచ్ఎస్ కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదన్నారు. కొన్ని ప్రాసెస్ లకు కూడా కార్డు వర్తించుట లేదన్నారు. ఇటువంటి లోటుపాట్లను సవరించి డబ్ల్యూజేహెచ్ఎస్ ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. పథకం అమల్లో ఎదురవుతున్న రోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, , జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని రెండేళ్లు గడిచిపోయిందని, ఇప్పటివరకూ ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. 201819 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు. అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలకు గానీ, వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని ఏపీలో కూడా ప్రారంభించాలని కోరారు. జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ నాయకులు భాస్కర్, శ్రీనాథ్ రెడ్డి, సాగర్, రమేష్ రెడ్డి, సుధాకర్, పరమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా–2026 ప్రచురణ

**- జిల్లాలో 1,127 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా**
**- ఓటర్లు తమ పేర్లు, వివరాలు పరిశీలించాలి**
**- సెప్టెంబర్ 16 వరకు క్లైయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం**
**- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి: కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో**
**ఆగస్టు 17 అనంత జనశక్తి న్యూస్ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా-2026ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని మొత్తం 1,127 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓ) కార్యాలయాల్లోనూ జాబితా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 27 మండలాలు ఉన్నాయని, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 8,63,413 మంది సాధారణ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ అంకిత్ తెలిపారు. వీరిలో 4,19,558 మంది పురుషులు, 4,43,805 మంది మహిళలు, 50 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. అదేవిధంగా 28 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 723 మంది సర్వీస్ ఓటర్లు నమోదై ఉన్నారని, అన్ని కేటగిరీలను కలిపి జిల్లాలో మొత్తం 8,64,164 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 110పినపాక (ఎస్టీ) నియోజకవర్గంలో 1,74,854 మంది సాధారణ ఓటర్లు, ఇద్దరు ఎన్ఆర్ఐ ఓటర్లు, 197 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 111ఇల్లెందు (ఎస్టీ) నియోజకవర్గంలో 1,94,860 మంది సాధారణ ఓటర్లు, నలుగురు ఎన్ఆర్ఐ ఓటర్లు, 274 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

117కొత్తగూడెం నియోజకవర్గంలో 2,15,639 మంది సాధారణ ఓటర్లు, 14మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 152 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 118అశ్వారావుపేట (ఎస్టీ) నియోజకవర్గంలో 1,44,770 మంది సాధారణ ఓటర్లు, ఆరుగురు ఎన్ఆర్ఐ ఓటర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 119భద్రాచలం (ఎస్టీ) నియోజకవర్గంలో 1,33,290 మంది సాధారణ ఓటర్లు, ఇద్దరు ఎన్ఆర్ఐ ఓటర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.



ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఓటరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పేరు లేకపోవడం, వివరాల్లో తప్పులు ఉండటం లేదా అర్హత లేని వ్యక్తుల పేర్లు నమోదై ఉండటం వంటి అంశాలను గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులో సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ అధికారులకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పు, తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించి సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓలను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఓటర్ల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించాలని కోరారు.

# ఐదుగురు టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

**అమరావతి, ఆగస్ట్ 17, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షగట్టిందన్నారు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ . ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహించడం సరికాదని.. ఈ అంశంపై కేంద్రంతో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి టీచర్లు ప్రయత్నిస్తే వారిని సస్పెండ్ చేయడం దారుణమని ధ్వజమెత్తారు. వెంటనే వారందరిపై సస్పెన్షన్ తొలగించాలని డిమాండ చేశారు.. లేకపోతే ఈ అంశంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. అన్యాయంపై ప్రశ్నించే ప్రతి గొంతుకకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులపై, అందులోనూ టీచర్లపై మరీ ఇంత కక్షగడతారా? అంటూ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఐదుగురు టీచర్లు ఎందుకు సస్పెండ్ చేశారు?.. ఏం నేరం చేశారు? అంటూ ప్రశ్నించారు. సర్వీసులో ఉన్న టీచర్లు ఉద్యోగంలో చేరే నాటికి టెట్ పరీక్ష లేదని.. ఇన్ని సంవత్సరాల తర్వాత పరీక్ష రాయాలన్న నిబంధన వల్ల లక్ష మందికిపైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ నిబంధన నుంచి తమను మినహాయించాలని కోరుతూ.. వారికి మద్దతు ఇస్తున్న ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడమే నేరమా? అంటూ ప్రశ్నించారు. రెడ్‌బుక్ అరాచక జంగిల్‌రాజ్ చివరకు ప్రభుత్వ టీచర్లనూ వదిలిపెట్టడం లేదని ధ్వజమెత్తారు జగన్. అసలు ఈ టెట్ నిబంధనను తొలగించాలని కేంద్రాన్ని ఎందుకు కోరలేదని.. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న మీరు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. టీచర్ల సమస్యను పట్టించుకోకపోతే.. ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ ఎంపీల సహకారంతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే మాత్రం వారిపై రాజకీయ ముద్ర వేస్తారా? సస్పెన్షన్లు విధిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేయలేని పని టీచర్లు చేయడానికి ప్రయత్నించడమే తప్పా?.. వినతిపత్రం ఇవ్వడమే నేరమా? దానికి సస్పెన్షన్ విధిస్తారా? అంటూ ప్రశ్నించారు. ఒక సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. అదే సమస్యను రాజకీయ కోణంలో చూసి టీచర్లకు రాజకీయాలను అంటగట్టడం దారుణమన్నారు. మరీ ఇంతగా దిగజారి వ్యవహరిస్తారా అంటూ మండిపడ్డారు. 'వెంటనే ఆ ఐదుగురు టీచర్లపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేయండి. వారికి క్షమాపణ చెప్పి చేసిన తప్పును సరిదిద్దుకోండి. లేకపోతే ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంటాం. ఈ అన్యాయమైన సస్పెన్షన్లను సవాల్ చేసే కార్యక్రమంలో ఆ టీచర్లకు న్యాయపరంగా పూర్తిగా అండగా నిలుస్తాం. వారికి భరోసా ఇస్తాం. అన్యాయాన్ని ప్రశ్నించే ప్రతి గొంతుకూ వైయస్సార్‌సీపీ అండగా నిలుస్తుంది' అన్నారు వైఎస్ జగన్.

టీచర్లు మాత్రమే కాదు ఉద్యోగుల విషయంలో ప్రభుత్వ మోసం ఇదే స్థాయిలో ఉందన్నారు జగన్. మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే IR ప్రకటిస్తామన్నారని.. మెరుగైన PRC ఇస్తామన్నారని.. ఇప్పటి వరకు IR లేదు, PRC లేదు, 5 DAలు పెండింగ్ పెట్టారన్నారు. CPS/OPSను పునఃసమీక్షిస్తామంటూ ఉద్యోగులకు ఆశ చూపారని.. చివరకు CPSకు ప్రత్యామ్నాయంగా తాము ప్రకటించిన GPSను కూడా అమలు చేయకుండా ఉద్యోగుల్ని ఇబ్బంది పెడుతున్నారన్నారు. 'ఉద్యోగులకు ఇవ్వాల్సిన PRC బకాయిలు, పెండింగ్ డీఏలు, GPF, APGLI, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవ్స్ లేదా ఎన్‌క్యాష్‌మెంట్ లీవులు.. ఇలా దాదాపు రూ. 35వేల నుంచి రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టారు. తమకు న్యాయంగా రావాల్సిన డబ్బుల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తుంటే ఒక్క పైసా ఇవ్వరు. కానీ వారికి సస్పెన్షన్లను బహుమానంగా ఇస్తున్నారు.ఇదేనా ఉద్యోగుల పట్ల మీ గౌరవం? ఇదేనా టీచర్ల పట్ల మీ బాధ్యత?. అధికారం ఉందనే అహంకారంతో, నియంతృత్వ విధానాలతో మీరు చెలరేగిపోతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు చంద్రబాబుగారూ. చివరకు మీ నీడను కూడా మీరు భరించలేని స్థాయికి వెళ్లిపోయారు' అంటూ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 10 కేసుల్లో 22 మందికి మరణశిక్ష

**- నాలుగు నెలల్లోనే యూపీ జడ్జి సంచలన తీర్పులు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17, అనంత జనశక్తి న్యూస్**

నాలుగు నెలల వ్యవధిలోనే పది కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధిస్తూ తీర్పులిచ్చి ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి వార్తల్లో నిలిచారు. లాయర్ హత్య నుంచి కిడ్నాప్, దోపిడీ వంటి అనేక కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించి, వారికి ఈ శిక్షలు ఖరారు చేయడం సంచలనంగా మారింది. అడిషినల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రవి కుమార్ దివాకర్.. నాలుగు నెలల కిందటే బదిలీ అయి వచ్చారు. గతంలో బరేలీలో పనిచేసిన సమయంలోనూ ఆయన 13 మందికి మరణశిక్ష విధించడం గమనార్హం. అయితే, 2022లో వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు కాంప్లెక్స్‌లో వీడియో సర్వేకు ఆదేశించి అప్పట్లో జాతీయ స్థాయిలో ఈయన వార్తల్లో నిలిచారు. ఇటీవల వరుసగా ఆయన మరణ శిక్షలు విధించడంతో 'అత్యంత అరుదైన కేసుల్లోనే' ఈ శిక్ష విధించాలన్న సహజ న్యాయసూత్రంపై చర్చ మొదలైంది.

ఎవరీ రవికుమార్?

లక్నోకు చెందిన రవి కుమార్ దివాకర్.. బీకాం, ఎల్ఎల్ఎం పూర్తిచేసి, 2009లో అజమ్‌గఢ్ అడిషినల్ సివిల్ జడ్జిగా కెరీర్ మొదలుపెట్టారు. తర్వాత మే 2015లో సుల్తాన్‌పూర్ సివిల్ జడ్జిగా నియమితులై తర్వాత ఐదు నెలలకే సుల్తాన్‌పూర్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌గా ప్రమోషన్ పొందారు. గతేడాది నవంబరు 2025 నుంచి ముజఫర్‌నగర్ అడిషినల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా కొనసాగుతున్నారు. గత నాలుగు నెలల వ్యవధిలో ఆయన 10 కేసుల్లో 22 మందికి మరణశిక్ష ఖరారు చేయడం గమనార్హం.

12 ఏళ్ల నాటి హత్య కేసులో నలుగురికి మరణశిక్ష

ఆగస్టు 13న 12 ఏళ్ల నాటి హత్య కేసులో నలుగురికి మరణశిక్ష ఖరారు చేశారు. పవన్ కుమార్ హత్య కేసులో దోషులుగా తేలిన రామ్‌వీర్, రాజీవ్, రాహుల్, హరేందర్ కుమార్‌లకు ఆయన రూ. 1.70 లక్షల జరిమానా కూడా విధించారు. 2014 జులై 14న షామ్లీ జిల్లాలో పాత కక్షల కారణంగా జరిగిన దాడిలో నిందితులు కుమార్ ఇంట్లోకి ప్రవేశించి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో కుమార్ మరణించగా, అతడి సోదరుడు అశోక్ కుమార్ బుల్లెట్ గాయాలతో బయటపడ్డాడు.

1999 కలప వ్యాపారి హత్య కేసులో మరణశిక్ష

ఆగస్టు 12న దాదాపు 27 ఏళ్ల క్రితం డబ్బు కోసం ఒక కలప వ్యాపారిని కిడ్నాప్ చేసి, హత్య చేసిన వ్యక్తికి ఆయన మరణశిక్ష విధించారు. 1999లో సలీం హత్య కేసులో దోషి అయిన షానవాజ్‌ను దోషిగా నిర్ధారించారు. సలీంను అపహరించి, రూ.5 లక్షలు డిమాండ్ చేసిన అతడు.. తర్వాత 1999 డిసెంబర్ 9న చాపర్‌లోని ఒక అడవిలో అతని గొంతు కోసి చంపారు.

2011 నాటి రైతు హత్య కేసులో నలుగురికి మరణశిక్ష

2011లో షామ్లీ జిల్లాలో దోపిడీ ప్రయత్నంలో భాగంగా ఒక రైతును హత్య చేసిన కేసులో, జులై 17న నలుగురు వ్యక్తులకు మరణశిక్ష విధించారు. 2011 ఆగస్టు 20న, రాజ్ సింగ్ అనే రైతు తన స్నేహితుడు బిజేంద్రతో కలిసి మోటార్ సైకిల్‌పై తన సోదరి ఇంటికి వెళ్తుండగా.. గుర్తు తెలియని దుండగులు వారిని అడ్డగించారు. నిందితులు వారిని దోచుకోవడానికి ప్రయత్నించారు. రాజ్ సింగ్ ప్రతిఘటించడంతో అతడిని కాల్చి చంపగా, బిజేంద్రను కట్టేసి సమీపంలోని చెరకు పొలంలో పడేశారు.

హత్య కేసులో మాజీ గ్రామ సర్పంచ్, అతని సహచరుడికి మరణశిక్ష

2010 నాటి హత్య కేసులో జులై 6న ఒక మాజీ గ్రామ సర్పంచ్‌కు, అతని సహచరుడికి మరణశిక్ష విధించారు. ఈ కేసు అత్యంత అరుదైన కేసుల కోవలోకి వస్తుందని జడ్జి రవి కుమార్ వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో కక్షల కారణంగా 2010 ఆగస్టు 24న 60 ఏళ్ల రాజ్‌బీర్ సింగ్‌ను కాల్చి చంపారు. ఈ హత్యకు సంబంధించి మాజీ గ్రామ సర్పంచ్ ప్రమోద్, అతని సహచరుడు సహదేవ్‌లను తర్వాత అరెస్టు చేశారు.

హోంగార్డు హత్య కేసు

జులై 2న న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డును హత్య చేసిన వ్యక్తిని దోషిగా నిర్ధారించి, ఈ కేసు 'అరుదైన వాటిలోకెల్లా అరుదైనది' అని పేర్కొంటూ అతడికి మరణశిక్ష విధించారు. గరిష్ఠ శిక్ష విధించే పరిస్థితులలో ఈ హత్య జరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సంఘటన 2020 జూన్ 4న జరిగింది. ఆ సమయంలో హోంగార్డు రతీరామ్ విధి నిర్వహణలో ఉన్నారు. నిందితుడు అతడి తల్లిపై దాడి చేయడంతో ఆమెను రక్షించడానికి రతీరామ్ ప్రయత్నించాడు. ఆగ్రహానికి గురైన నిందితుడు రతీరామ్‌ను కత్తితో పొడిచి చంపాడు.

# పేదలకు కార్పొరేట్ వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

పేద ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై పూర్తి నమ్మకం, విశ్వాసం కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తే వారు ఆత్మగౌరవంతో బతుకుతారని, వారికి మనం ప్రత్యేకంగా ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. సంక్షేమ పథకాలపై భారం తగ్గాలంటే విద్యా వ్యవస్థ పునాదులు బలంగా పడాలని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలపై సీఎం తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే పగటి వేషగాడిలా కేటీఆర్‌ను తీసుకుని హడావుడి చేశారని ఎద్దేవా చేశారు. గత పాలకులు తమ కుటుంబాల కోసం ఫామ్‌హౌస్‌లను వేగంగా నిర్మించుకున్నారు గానీ, పేదల కోసం మొదలుపెట్టిన టిమ్స్ ఆస్పత్రులను పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. ప్రతిపక్షాలు తమ బుద్ధి మార్చుకోవాలని, రాష్ట్రంలో కరువు రావాలని పూజలు చేయడం, అబద్ధాల ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ ఎన్నికల్లో సున్నా సీట్లు వచ్చినా, సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా వారి తీరు మారలేదన్నారు. కేసీఆర్ కొడుకు కేటీఆర్ ఇలాగే అబద్ధాలు చెప్తూ ఉండాలని, తాను నిజాలు చెప్తూ ప్రజల్లోకి వెళ్తానని, ప్రతిపక్షాలు ఇలాగే ఉంటే తమకు రాజకీయం మరింత తేలికవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మలేరియా, డెంగ్యూ నివారణకు పకడ్బందీ చర్యలు



- ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా నిర్వహించాలి
- జ్వరం కేసులకు రక్త పరీక్షలు చేయాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 17, అనంత జనశక్తి న్యూస్

వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మగ ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. మగ ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇళ్ల పరిసరాలు, వీధులు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి బొండాలు, పూల కుండీలు తదితరాల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించి దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో నమోదయ్యే ప్రతి జ్వరం కేసుకు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని, మలేరియా అనుమానిత కేసుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని సూచించారు. పాజిటివ్ కేసులు గుర్తించిన వెంటనే చికిత్స అందించడంతో పాటు తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే వలస కూలీలు, వ్యవసాయ కార్మికుల వివరాలను నమోదు చేయాలని, మలేరియా ప్రభావిత ప్రాంతాల నుంచి తిరిగి వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. వలస కూలీలు అధికంగా ఉండే గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలు, గిరిజన ఆవాసాలు, సరిహద్దు ప్రాంతాల్లో జ్వరం కేసులను వెంటనే గుర్తించాలని సూచించారు. జ్వరం వచ్చినప్పుడు స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్ఓ ప్రజలకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించగలమని తెలిపారు. కార్యక్రమంలో ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారులు డాక్టర్ శ్రీధర్ (భద్రాచలం), డాక్టర్ ప్రతాప్ (కొత్తగూడెం) పాల్గొన్నారు.



# కొండగట్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. 20 మందికి తీవ్ర గాయాలు

కొండగట్టు, అనంతజనశక్తి న్యూస్

జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మల్యాల మండల పరిధిలో ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురై ఆర్తనాదాలు చేశారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. నిజామాబాద్ వైపు వెళ్తుండగా కొండగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడినవారిలో చిన్నారులు, మహిళలు కూడా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుస్తోంది.

**ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ఇతర వాహనదారులు వేగంగా స్పందించారు. గాయపడిన వారిని బస్సులో నుంచి బయటికి తీసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఇక లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతడిని బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించారు. చివరకు అతడిని క్యాబిన్ నుంచి బయటకు తీసుకొచ్చారు. గాయపడిన వారిని దగ్గర్లో ఉన్న జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనతో కొద్దిసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.**

**ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. బస్సు, లారీ ఏ పరిస్థితుల్లో ఎదురెదురుగా ఢీకొన్నాయనే అంశంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్యపై ఎలాంటి సమాచారం లేదని.. ప్రస్తుతం అందిన వివరాల ప్రకారం సుమారు 20 మంది గాయపడినట్లు తెలుస్తోంది.**

# పేకాటరాయుళ్లా.. కాంగ్రెస్ నాయకులా?

మణుగూరు, ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్

పినపాక నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకుల వ్యవహారశైలి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పేకాట ఆడుతూ పలు మార్లు పట్టుబడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు నేతలు రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమను తాము మంత్రికి అత్యంత సన్నిహితులుగా చెప్పుకుంటూ నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేకాట వ్యవహారాల్లో పట్టుబడిన సందర్భాలు ఉన్నప్పటికీ పార్టీ పరంగా కఠిన చర్యలు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఇసుక ర్యాంపుల వ్యవహారాలు, భూ పంచాయితీలు, పేకాట దందాలతో కొందరు నేతల పేర్లు ముడిపడుతున్నాయనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారిత ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వివరణలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సి ఉంది. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన నాయకులు వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.


నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు, వైద్యం, విద్య, ఉపాధి, గిరిజన సమస్యలపై వీరు ఎన్నిసార్లు అధికారులను ప్రశ్నించారన్నది ఇప్పుడు చర్చగా మారింది. ప్రజా సమస్యపై ప్రెస్‌నోట్ ఇచ్చిన సందర్భాలు, అధికారులను నిలదీసిన సందర్భాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు ప్రజలు సంధిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన నేతలు జూదం, దందాల



ఆరోపణలతో వార్తల్లోకి రావడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వం అవినీతి రహిత పాలన, ప్రజా సంక్షేమం గురించి మాట్లాడుతుంటే.. మరోవైపు కొందరు స్థానిక నేతలపై ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పేరు చెప్పుకుని వ్యక్తిగత ప్రయోజనాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు నిజమైతే అధిష్ఠానం ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. పేకాట కేసుల్లో ఎవరైనా పట్టుబడి ఉంటే వారి వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించి పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. అధికార పార్టీకి చెందినవారనే కారణంతో చట్టం వేరుగా పనిచేస్తుందనే భావన ప్రజల్లో కలగకూడదని వారు కోరుతున్నారు. ప్రజాసేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చి ప్రజల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత వ్యవహారాల్లో మునిగితేలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నిజంగా తప్పు చేయని నాయకులైతే తమపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అలాగే ఆరోపణలు నిరాధారమైతే వాటిని బహిరంగంగా ఖండించి తమ ప్రతిష్ఠను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇసుక ర్యాంపులు, భూ వివాదాలు, పేకాట వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలను సంబంధిత శాఖలు స్వతంత్రంగా పరిశీలించాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులపై పార్టీ అంతర్గతంగా సమీక్ష నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి ఆరోపణలు పదేపదే వస్తున్నప్పటికీ పార్టీ నాయకత్వం మౌనంగా ఉంటే అది పరోక్ష ప్రోత్సాహంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి విధేయత అంటే పదవులు, పలుకుబడి, వ్యక్తిగత ప్రయోజనాలు కాదని.. ప్రజల మధ్య నిలబడి వారి సమస్యల కోసం పోరాడటమేనని వారు గుర్తుచేస్తున్నారు. అధికార పార్టీలో ఉన్నామనే ధీమాతో చట్టాన్ని, పార్టీ క్రమశిక్షణను ఎవరూ ఉల్లంఘించకూడదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. పేకాట వ్యవహారాల్లో నిజంగా ఎవరు పట్టుబడ్డారు? కేసులు నమోదయ్యాయా? అనే అంశాలపై అధికారిక వివరాలను ఎక్సైజ్, పోలీసు శాఖలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఇసుక ర్యాంపులు, భూ పంచాయితీలకు సంబంధించి ఎవరెవరిపై ఆరోపణలు ఉన్నాయి? వాటిపై ఎలాంటి విచారణలు జరిగాయి? అన్నది వెలుగులోకి రావాల్సి ఉంది. ప్రజలు చేస్తున్న ఆరోపణలకు పార్టీ నాయకత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ శ్రేణుల్లోనూ చర్చ జరుగుతున్నట్లు సమాచారం. తప్పు చేసిన వారు ఎవరైనా సరే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెన్షన్‌కు వెనుకాడకూడదని ప్రజలు కోరుతున్నారు. ప్రజాసేవకు బదులు జూదం, వ్యక్తిగత దందాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ముద్ర నుంచి కాంగ్రెస్ పార్టీ బయటపడాలంటే నాయకత్వం కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల పక్షాన నిలవాల్సిన నాయకులే ఆరోపణల కేంద్రంగా మారితే.. ఆ ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? పినపాక నియోజకవర్గ ప్రజలు ఇప్పుడు ఇదే ప్రశ్నను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ముందుంచుతున్నారు.

# నాలుగు స్తంభాలాట

- ప్రజాస్వామ్యానికి పట్టిన అవినీతి చీడ!
- చట్టం.. అధికారం.. న్యాయం.. అక్షరం.. అన్నింటినీ ఆవహిస్తున్న అవినీతి!
- డబ్బునోడికి చట్టం చుట్టం.. అధికారికి అవినీతి అండం!
- న్యాయం కోసం నిరీక్షణ.. అధికారానికి లంచం.. అక్షరానికి పెట్టుబడి!
- నాలుగు స్తంభాలపై స్వార్థపు నీడ.. ప్రజాస్వామ్యం ఎటువైపు?
- ప్రజాస్వామ్య భవనానికి బీటలు..
- నాలుగు స్తంభాలపై అవినీతి మచ్చలు!




మాచర్ల శ్రీనివాస్, ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్

ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలబడాలంటే శాసన వ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పత్రికా వ్యవస్థ తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి. ఈ నాలుగు వ్యవస్థలను ప్రజా స్వామ్యానికి నాలుగు స్తంభాలుగా అభివర్ణిస్తారు. అయితే ప్రస్తుత సమాజంలో ఈ వ్యవస్థలపై అవినీతి, రాజకీయ ఒత్తిళ్లు, స్వార్థ ప్రయోజనాలు, ధన ప్రభావం వంటి అంశాలపై తరచూ చర్చ జరుగుతోంది. ప్రజల కోసం రూపొందాల్సిన వ్యవస్థలు కొన్నిసార్లు వ్యక్తులు, వర్గాలు, సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు స్తంభాల పనితీరును ప్రజల దృష్టిలో ఏమనుకుంటున్నారో చూద్దాం..

**చట్టాలు డబ్బున్నోడికి చుట్టాలయ్యాయి"**

చట్టం ముందు అందరూ సమానమే అనేది రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక సూత్రం. కానీ ఆచరణలో ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి వ్యవస్థలు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. సామాన్యుడు ఒక చిన్న సమస్య పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, ప్రభావశీలులు మాత్రం ఫోన్ కాల్‌తో పనులు పూర్తి చేసుకుంటున్నారనే అభిప్రాయం ప్రజల్లో కనిపిస్తోంది. చట్టాల రూపకల్పనలో ప్రజా ప్రయోజనాల కంటే శక్తివంతమైన వర్గాల ప్రయోజనాలకు ప్రాధాన్యం దక్కుతోందా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల ప్రభావం ప్రజాస్వామ్య నిర్ణయ ప్రక్రియను ప్రభావితం చేస్తుందనే ఆందోళన ఉంది. చట్టాన్ని ఉల్లంఘించిన సామాన్యుడిపై కఠిన చర్యలు కనిపిస్తే, పెద్ద ఆర్థిక శక్తి ఉన్న వ్యక్తుల విషయంలో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందనే విమర్శలు అప్పుడప్పుడు వినిపిస్తాయి. చట్టాల అమలులో సమానత్వం లేకపోతే ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను శాసనసభల్లో ప్రస్తావించాల్సిన బాధ్యతను మరింత సమర్థంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. చట్టం ఎవరి కోసం వంగకూడదు, ఎవరి కోసం కఠినంగా మారకూడదు. చట్టం ముందు డబ్బు కాదు, ధర్మం, రాజ్యాంగమే బలంగా నిలవాలి.

**అధికారుల అవినీతి వ్యవస్థ"**

ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థపై ఉంటుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. అయితే లంచం, అక్రమ ప్రయోజనాలు, మధ్యవర్తుల వ్యవస్థ, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలు ప్రభుత్వ వ్యవస్థపై అప్పుడప్పుడు మచ్చలు వేస్తున్నాయి. చిన్న పనికి కూడా అనవసర జాప్యం చేసి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఒక రకమైన వేధింపుగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలలో అర్హులైన వారికి ప్రయోజనం చేరే ముందు మధ్యవర్తుల జోక్యం పెరుగుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. టెండర్లు, అనుమతులు, నిర్మాణ పనులు, భూవ్యవహారాలు, పన్నులు వంటి రంగాల్లో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాధనం ప్రజల కోసమే ఖర్చు కావాలి కానీ అక్రమ ప్రయోజనాలకు మళ్లితే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. నిజాయితీగా పనిచేసే అధికారులు ఉన్నప్పటికీ కొద్దిమంది అధికారులపై వచ్చే ఆరోపణలు మొత్తం వ్యవస్థ ప్రతిష్ఠను ప్రభావితం చేస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం, ఆన్‌లైన్ సేవలు, సామాజిక తనిఖీలు పెరిగితే అవినీతికి అవకాశాలు తగ్గించే అవకాశం ఉంది. అధికారం ప్రజలపై పెత్తనం చేయడానికి కాదు, ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిన బాధ్యత అనే భావన బలపడాలి.

**కట్టుకథలకు, పెట్టుబడికి పుట్టిన అక్షర పుత్రికలు పత్రికలు"**

ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం, అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజల గొంతుకగా నిలవడం పత్రికా వ్యవస్థ ప్రధాన బాధ్యత. అందుకే మీడియాను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పిలుస్తారు. కానీ మీడియా రంగంలో కూడా ఆర్థిక ఒత్తిళ్లు, యాజమాన్య ప్రయోజనాలు, రాజకీయ అనుబంధాలు, ప్రకటనల ప్రభావం వంటి అంశాలపై విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వార్త కంటే సంచలనానికి ప్రాధాన్యం పెరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిర్ధారణ లేని సమాచారాన్ని వార్తగా ప్రచారం చేయడం వల్ల వ్యక్తుల ప్రతిష్ఠకు, సమాజానికి నష్టం కలిగే ప్రమాదం ఉంది. పెట్టుబడి ప్రయోజనాలు వార్తా నిర్ణయాలను ప్రభావితం చేస్తే పత్రికా స్వేచ్ఛ అసలు అర్థాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అదేవిధంగా రాజకీయ లేదా వ్యాపార ప్రయోజనాల కోసం వార్తలను వక్రీకరించడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అయితే ఇదే సమయంలో నిజాయితీగా పనిచేస్తున్న వేలాది మంది జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. అధికారుల అవినీతి, ప్రజల సమస్యలు, అక్రమాలు, నిర్లక్ష్యాలను బయటపెట్టే స్వతంత్ర పాత్రికేయత ప్రజాస్వామ్యానికి అత్యవసరం. అక్షరం అమ్ముడుపోకుండా, వార్త వాస్తవానికి అద్దంలా నిలిచినప్పుడే పత్రికా వ్యవస్థ తన నాలుగో స్తంభం బాధ్యతను సార్థకం చేసుకుంటుంది. నాలుగు స్తంభాల్లో ఏ ఒక్కటి బలహీనపడినా ప్రజాస్వామ్య భవనం కదిలే ప్రమాదం ఉంది. అందుకే అవినీతిని వ్యక్తుల తప్పిదంగా మాత్రమే కాకుండా వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన అంశంగా చూడాలి. ప్రజలు ప్రశ్నించాలి, అధికారులు జవాబుదారీగా ఉండాలి, చట్టాలు అందరికీ సమానంగా అమలుకావాలి, న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలి. పత్రికలు కూడా ప్రజల విశ్వాసాన్ని కాపాడుతూ వాస్తవాలనే ప్రచురించాలి. నాలుగు స్తంభాలు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్య భవనం నిలబడుతుంది. లేదంటే "నాలుగు స్తంభాలాట"గా మిగిలిపోతుంది.

## "అన్యాయం రాజ్యమేలుతున్న వేళ"

**న్యాయ వ్యవస్థ ప్రజల చివరి ఆశ్రయంగా భావించబడుతుంది. అన్యాయం జరిగినప్పుడు సామాన్యుడు న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. అయితే కేసుల పెండింగ్, విచారణలో జాప్యం, న్యాయం పొందేందుకు అయ్యే ఆర్థిక వ్యయం వంటి అంశాలు సామాన్యులకు సవాళ్లుగా మారుతున్నాయి. ఒక కేసు పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంటే బాధితుడికి న్యాయం ఆలస్యమవుతుంది. "ఆలస్యమైన న్యాయం కూడా ఒక రకంగా అన్యాయమే" అనే భావన ఇక్కడ ప్రాధాన్యం సంతరించు కుంటుంది. న్యాయ సహాయం అందుబాటులో లేకపోతే పేదలు తమ హక్కుల కోసం పోరాడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. న్యాయ వ్యవస్థలో పనిచేసే న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించడం అత్యంత అవసరం. న్యాయ ప్రక్రియపై రాజకీయ, ఆర్థిక లేదా ఇతర ఒత్తిళ్లు ఉండకూడదు. ప్రతి పౌరుడికి సమాన న్యాయం, త్వరితగతిన న్యాయం అందేలా సంస్కరణలు అవసరమనే అభిప్రాయం బలపడుతోంది. న్యాయ దేవత కళ్లకు గంతలు ఉన్నది పక్షపాతం కోసం కాదు, అందరినీ సమానంగా చూడటానికి అన్న విషయాన్ని వ్యవస్థ ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.**

# ప్రజావాణికి ఆలస్యంగా అధికారులు

- అంతంతమాత్రంగానే దరఖాస్తులు

గుండాల, ఆగస్టు 17, అనంత జనశక్తి న్యూస్ :

ఆళ్లపల్లి, గుండాల మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. అయితే సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. గుండాలలో మొత్తం 17 దరఖాస్తులు రాగా, సోమవారం కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే అందాయి.

ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు ఒక్కొక్కరుగా ఆలస్యంగా హాజరయ్యారు. గుండాల ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని, అంతర్గత రహదారులకు సీసీ రోడ్లు నిర్మించాలని, 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలని, మొక్కజొన్న కొనుగోలు బకాయిలు చెల్లించాలని కోరుతూ దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో బాలరాజు తెలిపారు.

ఆళ్లపల్లిలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో హాజరైనప్పటికీ ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు పెద్దగా రాలేదు. గ్రామాల్లో వ్యవసాయ పనులు కొనసాగుతుండటంతో పాటు కొంతమందికి ప్రజావాణి కార్యక్రమంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రాలేదని అధికారులు తెలిపారు.

అందిన దరఖాస్తుల్లోని సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుండాల, ఆళ్లపల్లి తహసీల్దార్లు సంగీత, ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం | రంగారెడ్డి
18.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం





# మీ బాయ్ ఫ్రెండ్‌కు ఇలాంటి అలవాట్లు ఉంటే వెంటనే వదిలేయండి, అతనితో జీవించడం కష్టం

ఇప్పుడు ప్రేమ పెళ్లిళ్లు చేసుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. మొదట బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ గా మొదలైన ప్రయాణం తర్వాత ప్రేమికులుగా.. ఆ తర్వాత భార్యాభర్తలుగా మారుతుంది. అయితే ఒక సంబంధాన్ని పెళ్లి వరకు తీసుకువెళ్లాలంటే ఎదుటి వ్యక్తిలో కొన్ని రకాల గుణాలు ఉండాలి. అలాగే కొన్ని రకాల అలవాట్లు ఉండకూడదు. మీ భాగస్వామిలో ఎలాంటి అలవాట్లు ఉంటే ప్రమాదమో తెలుసుకోండి.



## మీ స్వేచ్ఛను అడ్డుకోకూడదు

మీరు చేసే మంచి పనులకు అతని తోడు ఎప్పుడూ అవసరం. మీరు బయటకు వెళ్లాలని ప్రయత్నించినప్పుడు లేదా ఫోన్‌తో ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు, స్నేహితుల్ని కలవడానికి వెళుతున్నప్పుడు... అతడు పదేపదే అడ్డుకుంటే అది మంచి సంకేతం కాదు. అతను మిమ్మల్ని జీవితాంతం స్వేచ్ఛగా వదిలిపెట్టడని అర్థం. స్వేచ్ఛ లేని జీవితాన్ని గడపడం చాలా కష్టం. మీ మీద నమ్మకం ఉన్న వ్యక్తి మీరు ఎక్కడికి వెళ్ళినా అంగీకరించాలి. ఫోన్లో అందరితో మాట్లాడేందుకు ఒప్పుకోవాలి. అలా చేయడం లేదంటే అతడిలో విషపు గుణాలు ఉన్నాయని అర్థం చేసుకోండి.



## నియంత్రించే వ్యక్తి వద్దు

మీ బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ నిత్యం మిమ్మల్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తూ ఉంటే వారితో జీవితం కష్టంగా మారుతుంది. ఆమె లేదా అతడు ప్రేమతోనే మిమ్మల్ని నియంత్రిస్తున్నా కూడా జీవితాంతం భరించడం చాలా కష్టం. మీ కోరికలు మీ ఇష్టాల ప్రకారం జీవితాన్ని జీవించే అవకాశాన్ని వాళ్ళు మీకు ఇవ్వరు. కొన్నాళ్లకు మీ మధ్య బంధం కూడా వీగిపోతుంది. పెళ్లయ్యాక విడాకులు తీసుకునే బదులు బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ గా ఉన్నప్పుడే విడిపోవడం మీ కుటుంబాలకు మంచిది.




## తక్కువ చేసి మాట్లాడే వ్యక్తి

మీ భాగస్వామి అతని స్నేహితుల ముందు కుటుంబ సభ్యుల ముందు మీకు ఎక్కువ విలువను ఇవ్వాలి. మీ భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి.. కానీ అందరి ముందు మిమ్మల్ని ఎగతాళి చేసినట్టు మాట్లాడుతున్నా, మీ ఇష్టాలను తక్కువ చేస్తున్నా, మీ భావోద్వేగాలకు విలువ లేనట్టు మాట్లాడుతున్నా... ఆ వ్యక్తితో జీవితం చాలా కష్టం. అలాంటి వ్యక్తి విషపూరిత భాగస్వామి అని అర్థం చేసుకోండి. అలాంటి భాగస్వామితో సంబంధం లో ఉండడం ఎప్పటికైనా ప్రమాదకరమే.

పైన చెప్పిన లక్షణాలు ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడం రెండు కుటుంబాలకు ఇబ్బందిని కలిగిస్తుంది. ముఖ్యంగా మీరు జీవితాన్నే కోల్పోవాల్సి రావచ్చు. కాబట్టి ఇక్కడ చెప్పిన లక్షణాలున్న బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్ మీకు ఉంటే వీలైనంతవరకు బ్రేకప్ చెప్పుకొని ముందుకు వెళ్లడం ఉత్తమం. దీనివల్ల మీ జీవితమే కాదు మీ ఇంట్లోని వారి జీవితం కూడా నరకప్రాయం కాకుండా కాపాడుకోవచ్చు.



# ఉప్పు మాత్రమే కాదు.. ఈ 5 ఆహారాలు కూడా హైబీపీని పెంచేస్తాయి






జీవనశైలి వ్యాధుల్లో హైబీపీ ముఖ్యమైనది. చెడు ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడితో కూడిన జీవితం హైబీపీకి కారణాలు కావచ్చు. ప్రస్తుతం ఎంతోమంది చిన్న వయసులోనే హైబీపీతో ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి అధిక రక్తపోటు ఇప్పుడు సాధారణ వ్యాధిగా మారింది. కానీ దాని తీవ్రతను తక్కువగా అంచనా వేయలేము. సకాలంలో చికిత్స చేయకపోతే భవిష్యత్తులో గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యం, స్ట్రోక్ వచ్చే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. హైబీపీ అనేది జీవనశైలి వ్యాధిగా మారిపోయింది. మీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం ద్వారా దీనిని అదుపులో పెట్టుకోవచ్చు. హైబీపీకి కారణమయ్యే ఆహారంగా ఉప్పునే చెప్పుకుంటారు. ఉప్పు తగ్గిస్తే చాలు రక్తపోటు తగ్గుతుందని అనుకుంటారు. నిజానికి ఉప్పు వల్లే కాదు కొన్ని రకాల ఇతర ఆహారాల వల్ల కూడా హైబీపీ పెరిగే అవకాశం ఉంది.

1. ప్రాసెస్ట్ ఆహారాలు

స్థూలకాయం నుంచి హైబీపీ వరకు అన్నింటికీ ప్రాసెస్డ్ ఫుడ్సే కారణం. మీకు ఇష్టమైన ప్యాకేజీ బ్యాండ్ నూడుల్స్, చిప్స్, స్నాక్స్, బిస్కెట్లు, పాస్తా వంటివి తినడంలో అధిక రక్తపోటు పెరుగుతుంది. వాటిలో సోడియం, ట్రాన్స్ ఫ్యాట్స్, ప్రిజర్వేటివ్స్ అధికంగా ఉంటాయి. ఇవి హైబీపీకి నేరుగా కారణమవుతాయి. అటువంటి పరిస్థితిలో, మీకు కూడా హైబీపీ సమస్య ఉంటే, మీరు వీటిని తక్కువగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

2. వేయించిన ఆహారాలు

మీరు అధిక రక్తపోటుతో పోరాడుతుంటే, మీ ఆహారం నుండి ఎక్కువ వేయించిన ఆహారాన్ని తగ్గించండి. పకోడీలు, సమోసాలు, పిజ్జాలు, బర్గర్లు వంటి ఆహారం ఎంత టేస్టీగా ఉన్నా ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో ట్రాన్స్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును పెంచుతుంది. వీటితో పాటు ఉప్పు, పిండి, నూనె, మసాలా







దినుసులు అధిక మోతాదులో ఉండటం వల్ల బీపీని పెంచేస్తాయి.

3. ఊరగాయలు

ఇంట్లో తయారుచేసినా లేదా మార్కెట్లో కన్నా కూడా ఊరగాయలు అతిగా తింటే రక్తపోటును పెంచుతాయి. ఇందులో నూనె, ఉప్పు లేదా వెనిగర్ ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ రక్తపోటును పెంచుతాయి. ముఖ్యంగా రోజూ ఊరగాయలు తింటుంటే బీపీ మేనేజ్మెంట్ లో కష్టంగా మారుతుంది.

4. అప్పడాలు


ప్రతి ఇంట్లో అప్పడాలు, వడియాలు ఉంటాయి. వాటిలో కూడా సోడియం స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటాయి. అప్పడాలు అధికంగా తింటే క్రమంగా బీపీ పెరగడానికి కూడా కారణమవుతుంది.

5. పంచదార

ఉప్పు తినడం వల్లే రక్తపోటు పెరుగుతుందని ఎక్కువగా భావిస్తారు. అయితే షుగర్ ఎక్కువగా తినడం వల్ల కూడా బీపీ పెరగడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. చాక్లెట్, స్వీట్లు లేదా మరే ఇతర బేకరీ వస్తువు వంటి తీపి పదార్థాలు ఎక్కువగా తిన్నప్పుడు, ఇన్సులిన్ స్థాయి వేగంగా పెరుగుతుంది. దీనివల్ల సిరలు బిగుసుకుపోయి బీపీ పెరగడం మొదలవుతుంది. స్వీట్లు ఎక్కువగా తింటే హైబీపీ వచ్చే అవకాశాలు రెట్టింపు అవుతాయని నిపుణులు చెబుతున్నారు.



# శ్రీదేవి జీవిత కథలో నాదే బెస్ట్ చాప్టర్: రామ్ గోపాల్ వర్మ



దివంగత నటి శ్రీదేవి జీవితం ఆధారంగా 'ది ఎంప్రెస్' పేరుతో ఓ పుస్తకం రాబోతున్న సంగతి తెలిసిందే. రచయిత ధీరజ్ యు.కుమార్ రాసిన ఈ పుస్తకానికి సంబంధించిన వివరాలను.. ఆగస్టు 13న శ్రీదేవి జయంతి సందర్భంగా నటి ప్రియాంక చోప్రా ప్రకటించారు. అయితే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా ఈ పుస్తకంలో ఒక అధ్యాయాన్ని రాశారట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"ఈ పుస్తకానికి 'ది ఎంప్రెస్' అనే పేరు పెట్టినట్లు నాకు తెలీదు. ఆ పేరు బయోగ్రఫీకి సరిపోతుంది. కానీ, అలా కాకుండా 'స్క్రీన్ క్వీన్' అని పెడితే బాగుండేది. నేనూ ఈ పుస్తకంలో ఓ చాప్టర్ రాశా. నేను రాసిందే బెస్ట్ అని రచయితలు చెబుతున్నారు. బహుశా, అందులో రాసిన ప్రతి ఒక్కరికీ వాళ్లు అలాగే చెబుతున్నారేమో" అని ఆర్జీవీ నవ్వుతూ చెప్పారు. శ్రీదేవి జయంతి సందర్భంగా ఆమెను గుర్తుచేసుకున్నారా? తన సినిమాలేవైనా చూశారా? అని అడిగిన ప్రశ్నకు ఆర్జీవీ తనదైన శైలిలో బదులిచ్చారు. "లేదు.. చనిపోయిన వ్యక్తుల గురించి నేను అసలు ఆలోచించను. ఒకసారి వాళ్లు వెళ్లిపోయాక, నేను నా జీవితం మీద దృష్టి పెడతాను. ప్రస్తుతం హర్షవర్ధన్ రాణేతో తీస్తున్న 'పోలీస్ కంపెనీ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నా. చనిపోయి ఇన్నేళ్లైనా.. తెరపై ఆమె చేసిన మ్యాజిక్ నాకిప్పటికీ అర్థం కాదు. 'మిస్టర్ ఇండియా'లో ఆమె చేసిన చార్లీ చాప్లిన్ సీక్వెన్స్ తీసుకోండి.. ఆ నటన వెనక ఉన్న నైపుణ్యాన్ని ఊహించడం అసాధ్యం. నేను డైరెక్ట్ చేసిన నటీమణులలో ఆమె ఒక భిన్నమైన వ్యక్తి. నేను శ్రీదేవితో 'క్షణక్షణం' సినిమా తీశా. ఈ మూవీ షూటింగ్ సమయంలో తన సత్తా ఏంటో నాకు అర్థమైంది. ఒక్కో సీన్‌కి శ్రీదేవి 15-20 రకాల ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చేది. ఆమెతో కలిసి పని చేయడం ఓ 7-స్టార్ హోటల్‌లో ఉన్నంత కంఫర్టబుల్‌గా అనిపిస్తుంది" అని ఆర్జీవీ కొనియాడారు.

ఇదే ఇంటర్వ్యూలో శ్రీదేవితో తన తొలి పరిచయాన్ని ఆర్జీవీ గుర్తుచేసుకున్నారు. "సినిమా కోసం శ్రీదేవిని కలిసేందుకు చెన్నైలోని తన ఇంటికి వెళ్లాను. నేను హాల్‌లో ఆమె తల్లితో పాటు కూర్చున్నాను. ముంబయికి వెళ్లే హడావుడిలో ఉన్న శ్రీదేవి ఫ్లైట్ మిస్ అవుతుందేమోననే కంగారులో లోపలికి, బయటకు తిరుగుతున్నారు. ఆమె రూమ్‌లోకి వచ్చిన ప్రతిసారీ ఏదో స్వచ్ఛమైన గాలి వీచినట్లు అనిపించింది. మానవాళికి శ్రీదేవి నిజంగానే ఉందన్న విషయం తెలిసేలా.. ఆమె ఒక్కసారైనా మళ్లీ భూమిపైకి వస్తే బాగుండనిపిస్తుంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

# మరోసారి కన్నడ చిత్రంలో?



విజయవంతమైన 'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రీనిధి శెట్టి. ఈ విజయపరంపరను కొనసాగిస్తూ 'హిట్ ది థర్డ్ కేస్', 'తెలుసు కదా' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్నీ విశేషంగా అలరించింది. ఇప్పడీ జోష్‌లోనే ఆమె ఓ కన్నడ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కథానాయకుడు కిచ్చా సుదీప్ నటించిన 'విక్రాంత్ రోనా' ఫేమ్ దర్శకుడు అనూప్ భండారి దర్శకత్వం వహించనున్న ఓ చిత్రంలో శ్రీనిధి నటించనున్నట్లు సమాచారం. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమా కథ, జానర్, నటీనటుల వివరాలను చిత్రనిర్మాతలు త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీనిధి, వెంకటేశ్ కథానాయకుడిగా.. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చిత్రంలో నటిస్తుంది. మరి ఈ మధ్య కాలంలో వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్న ఈ భామ రాబోయే ఈ కన్నడ సినిమాలో ఎలాంటి మ్యాజిక్ చేయనుందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# సెట్లో శ్రీలీల సందడి



ఈ ఏడాది ప్రారంభంలోనే 'పరాశక్తి', 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించింది నాయిక శ్రీలీల. దక్షిణాదిలో తనేంటో నిరూపించుకున్న ఈ భామ.. ఓ ప్రేమకథా చిత్రంతో ఉత్తరాదిలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సన్నద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. శ్రీలీల, కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో అనురాగ్ బసు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే శ్రీలీల తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేయడానికి సెట్లోకి అడుగుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ కూడా ముగిసే అవకాశాలున్నాయని, షెడ్యూల్ సమస్యల కారణంగా ఈ చిత్ర రాకకు ఆలస్యమైందని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల ఖాతాలో 'ఓమ్' చిత్రముంది.

# ఈ విజయం సంతోషాన్నిచ్చింది

"కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు సినిమాని చూస్తారు. ఇప్పడది 'హుషార్ పిట్టలు' సక్సెస్‌తో మళ్లీ నిరూపితమైంద"న్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్ష్, వాసవి గణేశన్ జంటగా నటించిన ఈ సినిమాని బిక్షు తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వెంకట్ యాదవ్ నిర్మాత. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ ద్వారా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత డి. సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "టీజర్, ట్రైలర్లతోనే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడింది. ఇప్పుడు సినిమా విజయవంతమవ్వడంతో చిత్ర బృందమంతా సంతోషంగా ఉంది. తొలి రోజు ఈ సినిమాని లక్ష మంది చూశారు. దాదాపు కోటి ముప్పై లక్షల గ్రాస్ వచ్చింది. ఈ చిత్రంతో చాలా ఏళ్ల తర్వాత సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌కి బ్రేక్ వచ్చింది" అన్నారు. "స్టార్స్ లేకున్నా.. స్టార్ హీరో సినిమాకి వచ్చినంత ఆదరణ మా 'హుషార్ పిట్టలు'కి దక్కింది. ఈ చిత్ర బృందాన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. దీన్ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతల"న్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.."కంటెంటే కింగ్ అని ఈ సినిమా మళ్లీ నిరూపించింది" అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ష్, వాసవి, చరణ్ అర్జున్, వెంకట్ యాదవ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంక 284 ఆలౌట్.. భారత్‌కు భారీ ఆధిక్యం..






భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో శ్రీలంక 284 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత తిరిగి ఆట మొదలుకాలేదు. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసే సూచనలు కనిపించడంతో మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. శ్రీలంక బ్యాటర్లలో ఆరో స్థానంలో వచ్చిన సోనల్ దినూష (100; 168 బంతుల్లో) సెంచరీ చేయగా.. ఏడో స్థానంలో వచ్చిన నిరోషన్ డిక్వెల్లా (80; 115 బంతుల్లో) కీలక ఇన్నింగ్స్ ఆడారు. 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన లంకను దినూష, నిరోషన్ ఆదుకున్నారు. వీరు ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మిగతా బ్యాటర్లెవరూ చెప్పకోదగ్గ స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 4, రవీంద్ర జడేజా 3, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. టీమ్‌ఇండియాకు 178 పరుగుల ఆధిక్యం లభించింది.

శ్రీలంక బ్యాటర్ సోనల్ దినూష (100; 168 బంతుల్లో) సెంచరీ పూర్తిచేసుకుని తర్వాత బంతికే పెవిలియన్ చేరాడు. మానవ్ సుతార్ వేసిన 78 ఓవర్‌లో సింగిల్ తీసి దినూష టెస్టుల్లో తొలి శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో తర్వాత బంతికి ప్రభాత్ జయసూర్య (10) జురెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. జడేజా వేసిన తర్వాతి ఓవర్‌లో మొదటి బంతికే దినూష ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. శ్రీలంక ఇంకా 188 పరుగుల వెనుకంజలో ఉంది.

శ్రీలంక బ్యాటర్ కేశర నువాంత (2) ఔటయ్యాడు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. జడ్డూకు టెస్టుల్లో ఇది 350వ వికెట్. టెస్టుల్లో 4 వేలకుపైగా పరుగులు, 350 వికెట్లు పడగొట్టిన నాలుగో క్రికెటర్‌గా జడేజా నిలిచాడు. 67 ఓవర్లకు శ్రీలంక స్కోరు 243/7. ప్రభాత్ జయసూర్య (0), సోనల్ దినూష (79) క్రీజులో ఉన్నారు.

శ్రీలంక ఎట్టకేలకు ఆరో వికెట్ కోల్పోయింది. నిరోషన్ డిక్వెల్లా (80; 115 బంతుల్లో) పెవిలియన్ చేరాడు. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో దినూష, నిరోషన్ 146 పరుగుల భాగస్వామ్యానికి (213 బంతుల్లో) తెర పడింది. 62 ఓవర్లకు శ్రీలంక స్కోరు 236/6. ఆ జట్టు ఇంకా 226 పరుగుల వెనుకంజలో ఉంది. దినూష (74), కుశార నువాంత (0) క్రీజులో ఉన్నారు.

శ్రీలంక, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఆట కొనసాగుతోంది. టీ బ్రేక్ సమయానికి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో శ్రీలంక 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. ఈ సెషన్‌లో శ్రీలంక ఒక్క వికెట్టూ కోల్పోకుండా 116 రన్స్ రాబట్టింది. 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన శ్రీలంకను నిరోషన్ డిక్వెల్లా (71*), సోనల్ దినుష (62*) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. ఈ జోడీ ఇప్పటివరకు ఆరో వికెట్‌కు 124 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. శ్రీలంక ఇంకా 248 పరుగుల వెనుకంజలో ఉంది.

శ్రీలంక బ్యాటర్ సోనల్ దినుష (51*) కూడా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అతడికి టెస్టుల్లో ఇది రెండో హాఫ్ సెంచరీ. మరో బ్యాటర్ డిక్వెల్లాతో (54*) కలిసి సోనల్ ఆరో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 50 ఓవర్లకు 184/5.

సగం బ్యాటింగ్ లైనప్ కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న శ్రీలంకను నిరోషన్ డిక్వెల్లా (50*) ఆదుకొంటున్నాడు. సోనాల్ దినుష (38*)తో కలిసి విలువైన భాగస్వామ్యం నిర్మించాడు. ఈ క్రమంలో 68 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో అతడికిది 23వ అర్ధశతకం. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 46 ఓవర్లకు 167/5.

శ్రీలంక బ్యాటర్లు కాస్త కుదురుకున్నారు. లంచ్‌కు ముందే ఐదు వికెట్లను కోల్పోయిన లంకను సోనాల్ దినుష (32*), నిరోషన్ డిక్వెల్లా (31*) ఆదుకున్నారు. వీరిద్దరూ ఇప్పటికే ఆరో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నిర్మించారు. మరోవైపు టీమ్‌ఇండియా బౌలర్లూ కట్టుదిట్టంగా బంతులేస్తున్నారు. వికెట్ కోసం డీఆర్ఎస్ తీసుకున్నా కలిసిరాలేదు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 40 ఓవర్లకు 141/5.

లంచ్ బ్రేక్ తర్వాత నాలుగో ఓవర్‌లో భారత్‌కు వికెట్ దక్కే అవకాశం చేజారింది. మానవ్ సుతార్ వేసిన (31.5వ ఓవర్) బంతిని అడ్డుకోబోయిన నిరోషన్ డిక్వెల్లా (18*) విఫలమయ్యాడు. బంతి ప్యాడ్లను తాకడంతో ఎల్బీ కోసం భారత్ అప్పీలు చేసింది. అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. కానీ, టీమ్‌ఇండియా చివరి క్షణంలో డీఆర్ఎస్ తీసుకుంది. వికెట్లను తాకినట్లు తేలినా.. అంపైర్స్ కాల్ రావడంతో భారత్‌కు వికెట్ దక్కే అవకాశం చేజారింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 33 ఓవర్లకు 119/5. క్రీజ్‌లో డిక్వెల్లాతోపాటు సోనాల్ దినుష (23*) ఉన్నారు. శ్రీలంక ఇంకా 343 పరుగులు వెనుకంజలో ఉంది.

శ్రీలంక - భారత్ జట్ల మధ్య తొలి టెస్టు మూడో రోజు మొదటి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి శ్రీలంక 28 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. క్రీజ్‌లో సోనాల్ దినుష (14*), నిరోషన్ డిక్వెల్లా (8*) ఉన్నారు. అంతకుముందు నిరోషన్ మదుష్క (0), దినేశ్ చండిమాల్ (4) ఘోరంగా విఫలం కాగా.. లాహిరు ఉదారా (27), కమిందు మెండిస్ (14), ధనంజయ డిసిల్వా (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2.. సిరాజ్, కుల్‌దీప్, జడేజా తలో వికెట్ తీశారు.

జట్టును కాపాడుకుందామనుకున్న శ్రీలంక కెప్టెన్ ధనంజయ (21) పెవిలియన్‌కు చేరాడు. స్లిప్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా క్యాచ్‌ను అందుకొన్నాడు. రవీంద్ర జడేజా వేసిన (26.1వ ఓవర్) బంతిని డిఫెన్స్ ఆడదామని ధనంజయ ప్రయత్నించాడు. కానీ, బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి స్లిప్ వైపు వెళ్లింది. అక్కడే కేఎల్ సూపర్‌గా క్యాచ్ పట్టాడు. దీంతో 90 పరుగుల వద్ద శ్రీలంక ఐదో వికెట్‌ను కోల్పోయింది. ప్రస్తుతం క్రీజ్‌లో నిరోషన్ (0), సోనాల్ (13*) ఉన్నారు.

స్వల్ప వ్యవధిలో వికెట్లను కోల్పోయిన శ్రీలంకను ఆదుకొనేందుకు కెప్టెన్ ధనంజయ - సోనాల్ దినుష జోడీ ప్రయత్నిస్తోంది. దాదాపు 10 ఓవర్ల నుంచి వికెట్ ఇవ్వకుండా పోరాడుతోంది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 26 ఓవర్లకు 90/4. ధనంజయ (21*), సోనాల్ (13*) పరుగులతో కొనసాగుతున్నారు.

శ్రీలంక టాప్ ఆర్డర్ కుప్పకూలింది. భారత స్పిన్నర్ల దెబ్బకు కుదేలవుతోంది. మానవ్ సుతార్‌కు తోడుగా కుల్‌దీప్‌యాదవ్ తన వేట మొదలుపెట్టాడు. అయితే, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతమైన క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు. కుల్‌దీప్ వేసిన బంతిని (16.1వ ఓవర్) శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ (14) ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టేందుకు ప్రయత్నించాడు. కానీ, అక్కడే కాచుకుని ఉన్న గిల్ ఒంటిచేత్తో డైవింగ్ క్యాచ్ పట్టాడు. కమిందు నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. దీంతో 59 పరుగుల వద్ద శ్రీలంక నాలుగో వికెట్‌ను కోల్పోయింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 17 ఓవర్లకు 62/4. క్రీజ్‌లో ధనంజయ (4*), సోనాల్ (3*) ఉన్నారు.

శ్రీలంకను ఇబ్బందుల్లో పెడుతూ యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అదరగొట్టేస్తున్నాడు. నిలకడగా ఆడిన ఓపెనర్ లాహిరు ఉదారా (27)ను సుతార్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆఫ్ సైడ్ వేసిన బంతిని (13.5వ ఓవర్) షాట్‌కు యత్నించిన ఉదారా బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో యశస్వి చేతికి చిక్కాడు. దీంతో 53 పరుగుల వద్ద శ్రీలంక మూడో వికెట్‌ను నష్టపోయింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 14 ఓవర్లకు 53/3. క్రీజ్‌లో కమిందు మెండిస్ (12*), ధనంజయ డిసిల్వ ఉన్నారు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైంది.

యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతం చేశాడు. తాను వేసిన తొలి బంతికే వికెట్ తీసి అబ్బురపరిచాడు. ఎనిమిదో ఓవర్‌ను వేస్తోన్న అతడు మొదటి బంతికే చండిమాల్ (4)ను పెవిలియన్‌కు చేర్చాడు. అద్భుతంగా టర్న్ అయిన బంతి చండిమాల్ గ్లౌవ్‌ను తాకుతూ వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతిలో పడింది. దీంతో 27 పరుగుల వద్ద శ్రీలంక రెండో వికెట్‌ను నష్టపోయింది.

తొలి ఓవర్‌లోనే వికెట్‌ను కోల్పోయిన శ్రీలంక ఆ షాక్ నుంచి కాస్త తేరుకుంది. బ్యాటర్లు ఉదారా (18*), చండిమాల్ (4*) మరో వికెట్ పడనీయకుండా ఆచితూచి ఆడుతున్నారు. ప్రస్తుతం 7 ఓవర్లు ముగిసేసరికి శ్రీలంక స్కోరు 27/1. అంతకుముందు టీమ్‌ఇండియా 462 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.


శ్రీలంక - భారత్ (IND vs SL) జట్ల మధ్య తొలి టెస్టు మూడో రోజు ఆట మొదలైంది. ఓవర్ నైట్ స్కోరుకు అదనంగా రెండు పరుగులను మాత్రమే జోడించిన టీమ్‌ఇండియా 462 పరుగులకు ఆలౌటైంది. చివరి వికెట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ (2) పెవిలియన్‌కు చేరాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకకు తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఓపెనర్ మదుష్క (0)ను సిరాజ్ ఔట్ చేశాడు. రెండో బంతికే స్లిప్‌లో ఉన్న పడిక్కల్‌కు మదుష్క క్యాచ్ ఇచ్చాడు. గత రెండు రోజులు వర్షం కారణంగా దాదాపు 60 ఓవర్ల వరకూ ఆట రద్దయిన సంగతి తెలిసిందే. దీంతో ఇవాళ ఓ పావుగంట ముందుగానే మ్యాచ్ మొదలైంది.

# పూర్తి వివరాలు బయటకు వెల్లడించాల్సిందే: ఐపీఎల్ ట్రేడింగ్‌పై సునీల్ గావస్కర్

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన నాటి నుంచే భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఫ్రాంచైజీ మారిపోతున్నాడంటూ వార్తలు వచ్చాయి. అతడిని ట్రేడ్ చేసుకొనేందుకు నాలుగు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించాయనేది వాటి సారాంశం. ఇంతవరకూ ఏ జట్టు గానీ, అటు హార్దిక్ గానీ దీనిపై నేరుగా ప్రకటన చేయలేదు. మరోవైపు ముంబయి ఇండియన్స్ మాత్రం తాము ఎవరితోనూ సంప్రదింపులు జరపలేదని స్పష్టం చేసింది. అయినా సరే ప్రచారం మాత్రం ఆగట్లేదు. హార్దిక్‌ను ఫలానా ధరకు ట్రేడ్ చేశారంటూ కథనాలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ .. బీసీసీఐతో పాటు ఫ్రాంచైజీల ముంగిట ఓ కీలక డిమాండ్ ఉంచారు.

"ఒక ఫ్రాంచైజీ నుంచి మరొకదానికి ప్లేయర్లు మారుతున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో తెగ హడావుడి జరుగుతోంది. ఆ ప్రక్రియకు సంబంధించి గడువు ముగిసేందుకు ఇంకా చాలా సమయం ఉంది. సదరు ప్లేయర్ వేరే ఫ్రాంచైజీకి మారినట్లు అందరికీ తెలిసినా.. ఎంత ట్రేడింగ్ జరిగిందనేది మాత్రం నలుగురికే తెలుస్తుంది. ఆటగాడితోపాటు బీసీసీఐ, రెండు ఫ్రాంచైజీల వద్ద మాత్రమే పూర్తి సమాచారం ఉంటుంది" అని గావస్కర్ తెలిపారు.

"ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఫ్రాంచైజీ తన జట్టు కోసం నిర్ణయించిన మేరకే వేతనాల పరిమితిని పాటించిందా? లేదా నిబంధనలను అతిక్రమించిందా అనేది ఇతరులకు ఎలా తెలుస్తుంది? పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం కోసం ట్రేడింగ్ వివరాలను బహిర్గతం చేయడం ముఖ్యం. ప్రపంచంలోనే ఐపీఎల్ అత్యుత్తమ టీ20 లీగ్. అందుకే, ఆర్థిక పరమైన విషయాల్లోనూ లీగ్ వైపు ఎవరూ వేలెత్తి చూపేందుకు ఆస్కారం ఇవ్వొద్దు. అందుకోసం ప్రతి విషయాన్ని బయటకు చెప్పడం ఉత్తమం. అప్పుడు ఐపీఎల్ ప్రొఫైల్ ఇంకా బెటర్‌గా మారుతుంది" అని గావస్కర్ సూచించారు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945